**నేటి కందం- నేటికి అందం**

బాబరు గా[గా వద్ద-న
వాబును యుద్ధమున గెలిచి-వంగము లోనన్
ప్రాబల్యము నొంది మొగలు
జాబిల్లిగ నిలచె రాజ్య సంస్థాపనలోన్
(6-5-1529 బాబర్ గా[గా
యుద్ధం లో బెంగాల్ ను గెలిచిన రోజు)



-రాధశ్రీ
సెల్:9494481210

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

**చురక**

ధాన్యం కొనుగోలులో
దేనికంత తాత్సారం
చేతికొచ్చినట్టి పంట
చేజారిన ఫలసారం
అకాల వర్షాలతోని
అన్నదాత కంటనీరు
ప్రభుత్వమేదైనా గాని
ప్రతీ ఏడు ఇదే తీరు



-వేల్పుల నారాయణ
9440433475

హైదరాబాద్ మంగళవారం 6-5-2025 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-50 001. సంపుటి :31 సంచిక:217 పేజీలు:6 వెల: రూ.1/-


## సరిహద్దులో ఉద్రిక్తతలు.. మరో క్షిపణిని ప్రయోగించిన పాక్



న్యూ డిల్లీ మే 5 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );పహల్గామ్ ఉగ్రవాద దాడి తర్వాత భారత సాయుధ దళాలు ప్రతీకార దాడి చేస్తాయనే భయంతో పాకిస్తాన్ వణికిపోతోంది. ఈ నేపథ్యంలో భారత్ తమపై దాడి చేస్తే.. అణ్వాయుధాలను ప్రయోగిసామని పాక్ బెదిరింపులకు దిగుతోంది. ఇప్పటికే భారీగా సైన్యాన్ని సరిహద్దులకు తరలించిన పాక్.. కవ్వింపు చర్యలకు దిగుతోంది. ఈ క్రమంలోనే సోమవారం మరోసారి క్షిపణి ప్రయోగం చేపట్టింది. సైనిక విన్యాసాలు 'ఎక్సర్‌సైజ్ ఇండస్'లో భాగంగా 120 కిలోమీటర్ల పరిధి కలిగిన ఫతాహ్ క్షిపణిని విజయవంతంగా పరీక్షించినట్లు పాకిస్తాన్ మీడియా వెల్లడించింది. కాగా, రెండు రోజు క్రితమే 450 కిలోమీటర్ల రేంజ్ గల బాలిస్టిక్ క్షిపణిని పాక్ ప్రయోగించిన సంగతి తెలిసిందే.

## ప్రతీకారం తీర్చుకోవడానికి ప్లాన్ రెడీ.. మోదీతో రక్షణ శాఖ కార్యదర్శి భేటీ

న్యూఢిల్లీ, మే 5:: పహల్గాం టెర్రర్ అటాక్ నేపథ్యంలో భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దాయాది గత 11 రోజులుగా ఎల్‌వోసీ వెంట కవ్వింపు చర్యలకు పాల్పడుతోంది. జమ్మూకశ్మీర్‌లోని కుప్వారా, బారాముల్లా, పూంచ్, రాజౌరి, మెంధార్, నౌషేరా, సుందర్‌బాని, అఖ్నూర్‌లో ఉన్న భారత పోస్టులపై కాల్పులకు తెగబడగా భద్రతా బలగాలు ధీటుగా బదులిస్తున్నాయి. ఈ క్రమంలోనే ఇవాళ ప్రధాని నరేంద్ర మోదీ, రక్షణ శాఖ కార్యదర్శి రాజేష్ కుమార్‌తో భేటీ ప్రాధాన్యతను సంతరించుకుంది. ఇప్పటికే త్రివిధ దళాధిపతులతో సమావేశమైన కీలక విషయాలను అడిగి తెలుసుకున్నారు. పాక్‌పై సైనిక చర్యకు తాము ఏ క్షణమైనా సిద్ధంగా ఉన్నామని త్రివిధ దళాధిపతులు ప్రధానికి స్పష్టం చేశారు.

### పాక్ ఆర్థిక, ఉగ్ర మూలాలే టార్గెట్

మరోవైపు పాక్ ఆర్థిక, ఉగ్ర మూలాలే టార్గెట్‌గా భారత్ పావులు కదుపుతోంది.

ఉగ్రవాదంపై పోరులో ప్రపంచానికి సందేశమిచ్చేలా వ్యూహ్యాన్ని సిద్ధం చేస్తోంది. దేశ సైనిక సన్నద్ధతతో పాటు ఆర్థిక, రాజకీయ అంతర్జాతీయ పరిణామాలపై కేంద్ర ప్రభుత్వం ప్రధానంగా దృష్టి పెట్టింది. ఇప్పటికే పాక్ ఆర్థిక వ్యవస్థను దెబ్బకొట్టేలా దౌత్య, వ్యాపార, వాణిజ్య, జలాలపై భారత్ నిషేధం విధించిన విషయం తెలిసిందే.

## మిస్ వరల్డ్ పోటీలతో పెరగనున్న హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ : రేవంత్ రెడ్డి



హైదరాబాద్, మే 5: మిస్ వరల్డ్ 2025 పోటీలను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను కోరారు. హైదరాబాద్ వేదికగా నిర్వహిస్తున్న పోటీలు నెల రోజులు సాగనున్నా యన్నారు..ప్రభుత్వం స్పాన్సర్ చేస్తున్న ఈ ప్రతిష్టాత్మక పోటీల వల్ల హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ మరింత పెరుగుతుందనే ఆశాభావం ఆయన వ్యక్తం చేశారు.కాగా, హైదరాబాద్ లో ఈనెల 10 నుంచి ప్రారంభం కానున్న మిస్ వరల్డ్-2025 ఏర్పాట్లపై కమాండ్ కంట్రోల్ సెంటర్ లో అధికారులతో నేడు ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ, మిస్ వరల్డ్ పోటీలలో పాల్గొనేందుకు వస్తున్న వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. విమానాశ్రయం, అతిథులు బస చేసే హోటల్, కార్యక్రమాలు జరిగే చోట కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలని పోలీస్ ఉన్నతాధికారులను స్పష్టం చేశారు. తెలంగాణలో చారిత్రక కట్టడాలు, పర్యాటక ప్రాంతాలను సందర్శించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. విభాగాల వారీగా ఏర్పాట్ల పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను నియమించాలని, నగరంలో పెండింగ్ లో ఉన్న బ్యూటిఫికేషన్ పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.

## నస్పూర్ ఎస్ఐకి పోలీస్ రియల్ హీరో అవార్డ్ !



హైదరాబాద్, మే 5:హైదరాబాదులోని కమాండ్ కంట్రోల్ సెంటర్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంచిర్యాల జిల్లా నస్పూర్ ఎస్సై ఉపేందర్ కు తెలంగాణ పోలీస్ రియల్ హీరో అవార్డును అందజేశారు.

ప్రాణాలను పణంగా పెట్టి నేరస్థుడిని పట్టుకోవడంలో ఆయన చేసిన సేవలకు గాను మంచిర్యాల జిల్లా నస్పూర్‌కు ఎస్ఐ ఉపేందర్‌కు ఉత్తమ అవార్డును ప్రదానం చేశారు.

ఉపేందర్ టాస్క్ ఫోర్స్ లో ఎస్ఐగా పనిచేస్తున్న సమయంలో? గంజాయి కేసులో నిందితుడు ఎస్ ఆర్ ఎస్ పి కాలువలోకి దూకి పారిపోయాడు.

అయితే, ఎస్ఐ ఉపేందర్ తన ప్రాణాలను పణంగా పెట్టి కాలువలోకి దూకి నిందితుడిని పట్టుకున్నాడు. ఈ నేపథ్యంలో ఉపేందర్ ధైర్యసాహసాలకు గాను పోలీస్ రియల్ హీరో అవార్డు లభించింది.

విధి నిర్వహణలో ప్రాణాలను పణంగా పెట్టిన ఎస్ఐని డీజీపీ జితేందర్ ప్రత్యేకంగా అభినందించారు.

ఇలాంటి పోలీసు అధికారుల వల్లే తెలంగాణ పోలీసులు దేశంలోనే అత్యుత్తమ పోలీసులుగా నిలిచారని అన్నారు.

ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు.

## 19వ తేదీన శబరిమల అయ్యప్ప ఆలయాన్ని సందర్శించనున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

న్యూ డిల్లీ మే 5 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ):భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రెండు రోజుల పాటు కేరళలో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో శబరిమల అయ్యప్ప ఆలయాన్ని కూడా సందర్శించనున్నారు. ఈ మేరకు రాష్ట్రపతి వర్గాలు సోమవారం వెల్లడించాయి.ఈనెల 18, 19 తేదీల్లో రాష్ట్రపతి ముర్ము కేరళలో పర్యటించనున్నారు. 18వ తేదీన రాష్ట్రపతి కొట్టాయం చేరుకుంటారు. అక్కడ జరిగే ఓ కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం 19వ తేదీన పంపా బేస్ క్యాంపుకు వెళ్లనున్నట్లు తెలిసింది. అక్కడి నుంచి శబరిమల అయ్యప్ప ఆలయం వద్దకు చేరుకోనున్నారు. అయితే, అందరి భక్తుల్లా రాష్ట్రపతి కొండపైకి వెళ్తారా.. లేక అత్యవసర అవసరాల కోసం ఉపయోగించే రహదారి ద్వారా ఆలయానికి చేరుకుంటారా అన్నదానిపై స్పష్టత లేదు. దీనిపై స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్ నిర్ణయం తీసుకుంటుందని ట్రావెన్‌కోర్ దేవస్వం ప్రెసిడెంట్ ప్రశాంత్ తెలిపారు. ఈ సందర్భంగా ద్రౌపదీ ముర్ము ఓ రికార్డు నెలకొల్పనున్నారు. శబరిమల ఆలయాన్ని సందర్శించిన తొలి ప్రెసిడెంట్‌గా ముర్ము నిలవనున్నారు.

## మోదీకి పుతిన్ కాల్ .. ఉగ్రవాదంపై పోరుకు మద్దతు

న్యూఢిల్లీ, మే 5:ఉగ్రవాదంపై పోరులో భారత్‌కు సంపూర్ణ మద్దతిస్తునట్టు రష్యా అధ్యక్షుడు పుతిన్ ప్రకటించారు. ప్రధాని మోదీకి పుతిన్ ఫోన్ చేశారు. పహల్గామ్ దాడికి తీవ్రంగా ఖండిస్తునట్టు పుతిన్ తెలిపారు. పహల్గామ్ దాడికి పాల్పడ్డ ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలన్నారు. ఉగ్రదాడి బాధితులకు న్యాయం చేయాలన్నారు.

ఉగ్రవాదంపై పోరాటంలో భారతదేశానికి మద్దతు ఇవ్వడానికి రష్యా తన నిబద్ధతను పునరుద్ఘాటించింది. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ సోమవారం భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఫోన్ చేసి పహల్గామ్ ఉగ్రవాద దాడిని తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ వెల్లడించారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి ఫోన్ చేసి భారతదేశంలోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడిని తీవ్రంగా ఖండించారన్నారు. అమాయక ప్రజల మరణాలకు ఆయన తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఉగ్రవాదంపై పోరాటంలో భారతదేశానికి పూర్తి మద్దతు ఇస్తున్నట్లు ఆయన వెల్లడించారు. పహల్గామ్ దాడికి పాల్పడ్డ ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలన్నారు. ఉగ్రదాడి బాధితులకు న్యాయం చేయాలన్నారు.

ఈ దారుణమైన దాడికి పాల్పడిన నిందితులను, వారికి సహకరించిన వారిని న్యాయం ముందు నిలబెట్టాలని పుతిన్ స్పష్టం చేశారు. భారతదేశం-రష్యా మధ్య ప్రత్యేక, విశేష వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింతగా బలోపేతం చేయడానికి తమ నిబద్ధతను ఇద్దరు నాయకులు పునరుద్ఘాటించారు. 80వ విజయ దినోత్సవం సందర్భంగా అధ్యక్షుడు పుతిన్‌కు ప్రధానమంత్రి తన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సంవత్సరం చివర్లో భారతదేశంలో జరగనున్న వార్షిక శిఖరాగ్ర సమావేశానికి పుతిన్‌ను ఆహ్వానించారు.

## వచ్చిన ఆదాయానికి మించి ఏమీ చేయలేను

**- ఇప్పుడు కావాల్సింది సమరం కాదు.. సమయస్ఫూర్తి**
**-ఆర్టీసి సమ్మె నేపథ్యంలో ఉగ్యోగ సంఘాల తీరుపై సిఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం**

హైదరాబాద్ మే 5 (ఎక్స్ ప్రెస్ న్యూస్ : రాష్ట్రంలోని ఉగ్యోగ సంఘాల తీరుపై సిఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్టీసి సమ్మె నేపథ్యంలో ఆయన మాట్లాడుతూ.. 'ఇక సమరమే అని ఉద్యోగ సంఘాలు ప్రకటిస్తున్నాయి.. ఆ సమరం తెలంగాణ ప్రజలపైనా' అని రేవంత్ ప్రశ్నించారు. ప్రభుత్వాన్ని అస్థిరపరచాలని రాజకీయ పార్టీల కుట్ర అని సిఎం మండిపడ్డారు. ఈ కుట్రలో ఉద్యోగ సంఘాలు పావులుగా మారవద్దని అన్నారు. కొత్త కోరికలతో ధర్నాలు చేస్తే.. ఉన్న వ్యవస్థ కుప్పకూలిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగ సంఘాలు బాధ్యత మరిస్తే.. సమాజం సహించదు అని పేర్కొన్నారు. 'మొదటి తారీఖునే జీతాలు ఇస్తున్నందుకా.. మీ సమరం' అని ప్రశ్నించారు. 'ఆర్థిక ఇబ్బందుల్లో ఉంటే సహకరించాల్సిన ఉద్యోగ సంఘులే సమరం అంటే ఎలా? ప్రజలు కష్టాల్లో ఉంటే అండగా ఉండాల్సిన బాధ్యత ఉద్యోగ సంఘాలకు లేదా' అని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్య ఉంటే చర్చించుకుందామని ఉద్యోగ సంఘాలను విజ్ఞప్తి చేశాం."అప్పులు పుట్టినా ఏదైనా చేయొచ్చని, కానీ, అప్పులు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ దెబ్బతింది.. స్వీయ నియంత్రణే పరిష్కారం. ప్రభుత్వం మన కుటుంబ.. కుటుంబ పరువును బజారున పడేయొద్దు. నన్ను కోసినా వచ్చిన ఆదాయానికి మించి ఏమీ చేయలేను. ఇప్పుడు కావాల్సింది సమరం కాదు.. సమయస్ఫూర్తి. తెలంగాణను మళ్లీ కోతుల గుంపునకు అప్పగించవద్దు. నాతో కలిసి రండి.. తెలంగాణలను అభివృద్ధి పథంలో తీసుకెళ్దాం" అని రేవంత్ అన్నారు.

## రోడ్లు బాగుంటేనే .. దేశం అభివృద్ధి

**- కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ**
**అమృత్ సరోవర్ పథకానికి తెలంగాణ సహకరించాలి**
**ఎలక్ట్రికల్ వెహికల్స్‌తో కాలుష్య నివారణ అందుకే ప్రోత్సహిస్తున్నాం**
**మేడారం, భద్రాద్రి, బాసరలకు జాతీయ రహదారితో అనుసంధానం**
**తెలంగాణ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం**

హైదరాబాద్, మే 5:: రహదారులు బాగుంటేనే దేశం అభివృద్ధి చెందుతుందని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. సోమవారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కాగజ్ నగర్ లో మహారాష్ట్ర సరిహద్దులో రూ.3,526 కోట్లతో నిర్మించిన 95 కిలోమీటర్ల మేర ఫోర్ లైన్స్ రోడ్డు, పలు అభివృద్ధి పనులు, కొత్త వంతెనల నిర్మాణం, రహదారుల విస్తరణకు ఆయన ప్రారంభోత్సవం, శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. రహదారులు మెరుగ్గా ఉండే దేశాన్నే అభివృద్ధి చెందిన దేశంగా భావిస్తారని పేర్కొన్నారు. వ్యవసాయం, ఉపాధి, రవాణా, మౌలిక వసతులు అనే నాలుగు అంశాలు దేశాభివృద్ధిని నిర్దేశిస్తాయన్నారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉందని తెలిపారు.

### రాష్ట్రాల మధ్య అనుసంధానం పెంచుతాం

రాష్ట్రాల మధ్య అనుసందానం పెంచేందుకు కీలకమైన ప్రాజెక్టును చేపట్టామని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. రోడ్డు కనెక్టివిటీలో భాగంగా క్లిష్టమైన వంతెనలు, సొరంగ మార్గాలు నిర్మిస్తున్నాం జోజిలా పాస్ టన్నెల్ వంటి నిర్మాణాలను చేపట్టామన్నారు. సూర్యాపేట నుంచి దేవరపల్లి వరకు గ్రీన్ ఫీల్డ్ రహదారి నిర్మించనున్నామన్నారు. నాగ్పూర్ నుంచి విజయవాడ కారిడార్ చేపట్టాం తెలంగాణ-మహారాష్ట్ర మధ్య రోడ్డు కనెక్టివిటీ మరింత పెరగనుందని చెప్పారు. భద్రాచలం, బాసర, మేడారం వంటి ఆధ్యాత్మిక క్షేత్రాలను




జాతీయ రహదారులతో అనుసంధానం చేస్తామన్నారు. జగిత్యాల-కరీంనగర్ హైవే విస్తరణ పనులను త్వరలోనే చేపడతామన్నారు. హైదరాబాద్‌లో ట్రాఫిక్ సమస్య తగ్గించేందుకు ఎన్నో ప్రాజెక్టులు చేపట్టామని చెప్పారు. . కాలుష్య నియంత్రణలో భాగంగా ఎలక్ట్రిక్ సీఎన్జి వాహనాలను ప్రోత్సహిసున్నాం. పెట్రోల్ వాహనాలకు బదులుగా విద్యుత్ వాహనాలు పెరగాలన్నారు.

### అమృత్ సరోవర్ పథకానికి తెలంగాణ సహకరించాలి

అమృత్ సరోవర్ పేరుతో నీటి నిల్వలను పెంచుతున్నామని ఈ పథకానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సహకరించాలని గడ్కరీ కోరారు. రాష్ట్రంలో నీటి సరస్సులను గుర్తిస్తే అభివృద్ధి చేస్తామన్నారు. ఆదిలాబాద్ జిల్లాకు ప్రత్యేక చరిత్ర ఉందని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. భూమి కోసం, భుక్తి కోసం ఎన్నో పోరాటాలు చేసిన ఆదివాసీల జిల్లా ఇది అని, ఈ జిల్లాకు ఎక్కువ సార్లు రావడానికి నేను ఇష్టపడతానన్నారు. రోడ్డు కనెక్టివిటీలో భాగంగా క్లిష్టమైన వంతెనలు, సొరంగ మార్గాలు నిర్మిస్తున్నామనిజొజిలా పాస్ టన్నెల్ వంటి క్లిష్టమైన నిర్మాణాలను చేపట్టామన్నారు. తెలంగాణలోనూ పలు జిల్లాల్లో జాతీయ రహదారులు నిర్మిస్తున్నామని హైదరాబాద్ లో ట్రాఫిక్ సమస్య తగ్గించేందుకు ఎన్నో ప్రాజెక్టులు చేపట్టినట్టు చెప్పారు.

### ప్రతీపేదవాడికి సంక్షేమ పథకం

ప్రతి పేదవారికి సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. వెనకబడిన జిల్లాల్లో అభివృద్ధి కార్యక్రమాల కోసం పని చేస్తున్నామన్నారు. కాలుష్య నియంత్రణలో భాగంగా ఎలక్ట్రిక్, సీఎన్ జీ వాహనాలను ప్రోత్సహిస్తున్నామని, పెట్రోల్ వాహనాలకు బదులుగా ఈవీ, సీఎన్జీ వాహనాలు ఇంకా పెరగాలన్నారు. దేశంలో నీళ్ల కొరత లేదని నీటిని సద్వినియోగం చేసుకోవడంలో విఫలం అవుతున్నామన్నారు. రాష్ట్రాల మధ్య అనుసంధానం పెంచేందుకు కీలకమైన ప్రాజెక్టులను కేంద్రం చేపట్టిందన్నారు. పోలవరం నుంచి వృథాగా సముద్రంలోకి నీళు వదులుకుంటున్నామన్నారు.

### జాతీయ రహదారి వస్తరణతో ప్రమాదాల నివారణ : మంత్రి కిషన్ రెడ్డి

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ "జాతీయ రహదారుల విస్తరణ వల్ల రోడ్డు ప్రమాదాలు, ప్రయాణ సమయం భారీగా తగ్గాయని అన్నారు. రోడ్డు. రైల్వే విమాన కనెక్టివిటీ పెంచేందుకు కేంద్రం అంకితభావంతో పనిచేస్తోందని అన్నారు. దేశవ్యాప్తంగా ఏడు టెక్స్‌టైల్ పార్కులు మంజూరు చేస్తే తెలంగాణకు కూడా ఒకటి దక్కిందని, రూ.6,330 కోట్లతో రామగుండంలో యూరియా ఉత్పత్తి పరిశ్రమను పునరుద్ధరించుకున్నామని చెప్పారు. ఇచ్చిన హామీ ప్రకారం నిజామాబాద్ జిల్లాకు పసుపు బోర్డు మంజూరు చేశామని, ఆదిలాబాద్ డిఫెన్స్ ఎయిర్‌పోర్టు ప్రారంభించేందుకు కేంద్రం సిద్ధమవుతోందని అన్నారు. దేశంలో 80 కోట్ల మంది పేదలకు ఉచితంగా రేషన్ బియ్యాన్ని మోదీ ప్రభుత్వం అందజేస్తోందని కేంద్ర అందజేస్తోందని కిషన్ రెడ్డి అన్నారు.

### చొరవ తీసుకోవాలి : మంత్రి సీతక్క

ఎలాంటి వివక్ష లేకుండా రోడ్ల అనుసంధానం కోసం రాష్ట్ర ప్రభుత్వానికి నిధులు కేటాయించాలని మంత్రి సీతక్క విజ్ఞప్తి చేశారు. అటవీ అనుమతులు లేకపోవడంతో చాలా అటవీ ప్రాంత పల్లెలకు రోడ్ల కనెక్టివిటీలో జాప్యం జరుగుతోందని, అందువల్ల వీటికి త్వరగా అనుమతులు వచ్చేలా కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ చొరవ తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలోని రేవంత్ రెడ్డి ప్రభుత్వం అభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు. అభివృద్ధి విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

### మంత్రి కోమటిరెడ్డి భోళా మనిషి : కేంద్ర మంత్రి సంజయ్

మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఓ భోళా మనిషి అని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. బహిరంగ సభలో కేంద్ర బండి సంజయ్ మాట్లాడుతూ.. ఒకప్పుడు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అంటేనే వెనుకబడిన ప్రాంతంగా ఉండేదని అన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక జిల్లా రూపురేఖలు పూర్తిగా మారుతున్నాయని అన్నారు. రోడ్ల అభివృద్ధి పనుల కోసం తెలంగాణ నుంచి ఏ ఎంపీ అయినా.. పార్టీలతో సంబంధం లేకుండా మంత్రి నితిన్ గడ్కరీ దగ్గరికి వెళితే క్షణాల్లో పని అవుతుందని అన్నారు. తన మనసులో ఎలాంటి విద్వేషాలు ఉండవని.. ఏది ఉన్నా ఓపెన్‌గా చెప్పే మనస్తత్వమని అన్నారు.

## ఉజ్జయినిలోని మహాకాళేశ్వర ఆలయ సముదాయంలోని భారీ అగ్నిప్రమాదం



ఉజ్జయి మే 5 (ఎక్స్ ప్రెస్ న్యూస్):మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయిని లో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. మహాకాళేశ్వర ఆలయ సముదాయంలోని శంభ్ ద్వార్ సమీపంలో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ఈ ఘటనతో భక్తులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ అధికారులు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకొని మంటలను అదుపుచేసేందుకు చర్యలు చేపట్టారు. షార్ట్ సర్క్యూట్ కారణంగానే మంటలు చెలరేగినట్లు ప్రాథమికంగా తేల్చారు. అయితే, అదృష్టవశాత్తూ ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం సంభవించలేదు. మంటలు పెద్ద ఎత్తున వ్యాపించడంతో ఆ ప్రాంతంలో దట్టమైన పొగ కమ్ముకుంది. ఇందుకు సంబంధించిన దృశ్యాలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి.

## 'డయల్ యువర్ సైబర్ నేస్తం' ను సద్వినియోగం చేసుకోవాలి : ఎస్పీ శరత్ చంద్ర పవార్

నల్లగొండ , మే 05 : సైబర్ మోసాలకు గురైన వారికి సలహాలు, పరిష్కారాల కోసం ఏర్పాటు చేసిన డయల్ యువర్ సైబర్ నేస్తం కార్యక్రమాన్ని బాధితులు సద్వినియోగం చేసుకోవాలని నల్లగొండ ఎస్పీ శరత్ చంద్ర పవార్ అన్నారు. ప్రతి సోమవారం ప్రజల సౌకర్యార్థం నిర్వహించే గ్రీవెన్స్ డే లో ఆయన మాట్లాడారు. ఎవరైనా సైబర్ మాసాలకు గురైతే వెంటనే 1930 గాని, https://www.cybercrime.gov.in గాని సమాచారం అందించాలన్నారు. ప్రతి సోమవారం ఉదయం 11 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు సైబర్ బాధితుల కోసం డయల్ యువర్ సైబర్ నేస్తం కార్యక్రమం ఉంటుందని తెలిపారు. 8712658079 ఫోన్ నంబర్‌కు కాల్ చేసి బాధితులు సమస్యలు తెలుపొచ్చన్నారు.

అలాగే గ్రీవెన్స్ డే లో భాగంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన దాదాపు 35 మంది అర్జీదారులతో ఎస్పీ నేరుగా మాట్లాడి వారి సమస్యలు ఆలకించారు. సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పూర్తి వివరాలు సమర్పించాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్‌కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడాలని సిబ్బందికి సూచించారు. వినతులు స్వీకరించి సంబంధిత ఫిర్యాదులపై క్షేత్ర స్థాయిలో పరిశీలించి వేగంగా స్పందించి, చట్ట పరంగా బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. శాంతి భద్రతలకు భంగం కలిగించే వారి పట్ల కఠినంగా వ్యవహరించాలన్నారు.



# భారత్‌లో ఉబ్బస వ్యాధి భారం అత్యధికం !

**(06 మే "ప్రపంచ అస్తమా దినం" సందర్భంగా)**

దీర్ఘకాలిక అసాంక్రమిక లేదా అంటువ్యాధి కాని (నాన్ కమ్యూనికబుల్ డిసీజ్) వ్యాధుల్లో అస్తమా లేదా ఉబ్బసం అతి ప్రధానమైనది. ప్రపంచ్యాప్తంగా సాలీనా 260 మిలియన్ల ప్రజలు ఈ వ్యాధితో బాధపడడం, అందులో 4.5 లక్షల వరకు మరణాలు కూడా సంభవిస్తున్నాయని అంచనా. పిల్లలు, యువతలో కూడా 15 శాతం వరకు నమోదు అవుతున్న అస్తమా వ్యాధి తగు జాగ్రత్తలతో ప్రాణాలను కాపాడుకోవచ్చని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. అస్తమా దాడి లేదా అస్తమా అటాక్ జరగడం వల్ల రోగుల్లో నిరాశ, కుటుంబ సభ్యుల్లో ఆందోళనలు పెరగడం, ఆసుపత్రి పాలు కావడం, చివరకు ప్రాణాలు కూడా పోవడం జరగవచ్చు. అల్ప-మధ్య ఆదాయ దేశాల్లో వైద్య సదుపాయాలు కొరవడడం, కార్టికోస్టిరాయిడ్ ఇన్‌హేలర్ ఔషధాల ధరలు అధికంగా ఉండడంతో అస్తమా కారణ మరణాలు 96 శాతం వరకు నమోదు కావడం విచారకరం. భారత్‌లో అత్యధిక ఉబ్బస రోగులు ఉన్నట్లు, మరణాలు కూడా 3.4 కోట్ల వరకు నమోదు అవుతున్నట్లు గణాంకాలు తెలుపుతున్నాయి.

ప్రపంచ అస్తమా దినం–2025:

1998లో "గ్లోబల్ ఇనిషియేటివ్ ఫర్ అస్తమా" చొరవతో మే మాసపు తొలి మంగళ వారం (అనగా 06 మే 2025) రోజున ప్రారంభమైన "ప్రపంచ అస్తమా దినం" ద్వారా ఉబ్బస వ్యాధి పట్ల ప్రజల్లో అవగాహన కల్పించడం, తీసుకోవలసిన జాగ్రత్తలను ప్రచారం చేయడం, అస్తమా రోగులకు ఆత్మవిశ్వాసం పెంచడం, కుటుంబాలకు ధైర్యాన్ని అందించడం, ఆధునిక పరిశోధనలతో ఉత్తమ చికిత్స విధానాలను రూపొందించడం లాంటి అంశాల ఎజెండాగా ప్రపంచ ఉబ్బస దినం వేదికలను వాడుకుంటున్నారు. 2025 ప్రపంచ అస్తమా దినం ఇతివృత్తంగా "మేక్ ఇన్‌హేలర్ ట్రీట్‌మెంట్స్ అక్సెసెబుల్ ఫర్ ఆల్" అనబడే అంశాన్ని తీసుకొని విస్తృత అవగాహన కలిపించడం కొనసాగుతున్నది. సరైన ఔషధాలను వాడుతూ ఉబ్బసాన్ని, ఉబ్బస దాడిని అదుపు చేసుకోవచ్చునే ధైర్యాన్ని కల్పించడం ప్రధాన ఉద్దేశంగా తోస్తున్నది.

అస్తమా అదుపుకు తీసుకోవలసిన ముందు జాగ్రత్తలు, ఔషధాలు:

అస్తమాను తగు జాగ్రత్తలతో నిరోధించవచ్చు. కలుషిత గాలి, శీతల గాలులు, పూల సుగంధ పరిమళాలు, దుమ్ము ధూళి, సిగరెట్టు పొగలు, బాణాసంచా కాల్చడం, అగరు వత్తులు పొగలు, ఫేస్ పౌడర్ పీల్చడం, ఎలర్జీకి కారణమయ్యే వాటికి దూరంగా ఉండడం వల్ల ఉబ్బసం వ్యాధి నివారించబడుతుంది లేదా వ్యాధిగ్రస్థుల్లో ఉపశమనం కల్పించబడుతుంది. వీటితో పాటు రోగులకు దూరంగా ఉండడం, శీతల వాతావరణాలకు దూరంగా ఉండడం, ఇల్లు/ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం, అందుబాటులో ఉన్న అన్ని వ్యాధుల కట్టడికి టీకాలను తీసుకోవడం, వైద్యుల సూచనలతో తగు ఔషధాలను విధిగా వాడడం తప్పనిసరిగా చేయడానికి ప్రయత్నించాలి. ప్రపంచవ్యాప్తంగా అస్తమాను తగు జాగ్రత్తలతో నిరోధించడంతో పాటు రోగులకు సరైన సూచనలు చేయడం, అన్ని ప్రాంతాల్లో ఉబ్బస వ్యాధి ఔషధాలను తక్కువ ధరలకే అందుబాటులో ఉంచడం, అస్తమా విద్యను విస్తరించడం, ఉబ్బస రోగులను/పౌర సమాజాన్ని శక్తివంతం చేయడం నేటి కనీస అవసరంగా పేర్కొనబడుతున్నది.

అస్తమా మరణాలను తగ్గించడం, అస్తమా రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను ప్రచారం చేయడం తక్షణ కర్తవ్యంగా ప్రభుత్వాలు, పౌర సమాజం భావించాలి. పేదరికం, అవగాహనలేమి, అపరిశుభ్ర వాతావరణం, పోషకాహారం కొరవడడం, ఔషధాలు తీసుకోకపోవడం, వైద్య సదుపాయాల కొరత లాంటివి అస్తమాను ప్రాణాంతక వ్యాధిగా మార్చుతున్నాయి. మన ఊరు వాడల్లో అస్తమా రోగులు ఉన్నట్లయితే తగు జాగ్రత్త సూచించడంతో పాటు పరిసరాల పరిశుభ్రత ప్రాధాన్యాన్ని వివరించడం మనందరి కనీస బాధ్యత.

– డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# భారత్‌లో క్రియేటర్-ఫస్ట్ వ్యవస్థ సృష్టించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

## -కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ ఎల్ మురుగన్

న్యూఢిల్లీ, మే 5:ముంబయిలో జరుగుతోన్న ప్రపంచ దృశ్య శ్రవణ వినోద సదస్సు(వేవ్స్) మూడో రోజున మోషన్ పిక్చర్ అసోసియేషన్(ఎంపీఏ) దేశ ఆర్థిక వ్యవస్థపై చలన చిత్ర, టెలివిజన్, స్ట్రీమింగ్ రంగాల ప్రభావాన్ని తెలియజేస్తూ ఒక సమగ్ర నివేదికను ఆవిష్కరించింది. కేంద్ర సమాచార, ప్రసార శాఖ సహాయ మంత్రి డాక్టర్ ఎల్ మురుగన్.. ఎంపీఏ చైర్మన్, సీఈఓ చార్లెస్ రివ్కిన్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా డాక్టర్ మురుగన్ మాట్లాడుతూ ఎంపీఏ అంతర్జాతీయ నాయకత్వాన్ని ప్రశంసించారు. ప్రపంచ ప్రేక్షకులపై భారతీయ సినిమా ప్రభావం పెరుగుతోందని ఈ సందర్భంగా కొనియాడారు. భారతీయ కథలు భాషలు, భౌగోళిక ప్రాంతాలకు అతీతంగా అలరించగలవని.. దీనిని ఆర్ఆర్ఆర్, బాహుబలి వంటి చిత్రాలు రుజువు చేశాయని అన్నారు.

విధానాలు, నిర్మాణ ప్రోత్సాపకాలు, మేధో సంపత్తి రక్షణ విషయంలో సహకారంతో క్రియేటర్ ఫస్ట్ వ్యవస్థను సృష్టించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన ప్రధానంగా చెప్పారు. పైరసీ నిరోధించేందుకు ఇటీవల చేపట్టిన సంస్కరణలను ఉటంకిస్తూ డిజిటల్ యుగంలో క్రియేటర్ల హక్కులను పరిరక్షించాల్సిన ఆవశ్యకత ప్రస్తావించారు.

"సినిమా అనేది కేవలం ఆర్థిక ఇంజిన్ మాత్రమే కాదు. ఇది ఒక ముఖ్యమైన దౌత్య, సాంస్కృతిక వారధి. ప్రపంచవ్యాప్తంగా గౌరవం పొందే, సురక్షితమైన సృజనాత్మక పరిశ్రమను సృష్టించడానికి మోషన్ పిక్చర్ అసోసియేషన్‌తో భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసుకునేందుకు భారత్ ఎదురుచూస్తోంది" అని ఆయన అన్నారు.

ఇప్పటికే భారత్‌తో కొనసాగుతోన్న ఎంపీఏ భాగస్వామ్యం విషయంలో చార్లెస్ రివ్కిన్ ఉత్సాహాన్ని వ్యక్తం చేశారు. దేశ వినోద పరిశ్రమకు ఇది చాలా కీలకమని అన్నారు. "భారత సృజనాత్మక ఆర్థిక వ్యవస్థ అసాధారణ వృద్ధికి సిద్ధంగా ఉంది. ఈ విషయంలో సహాయం అందించటం ఎంపీఏకు గర్వకారణం" అని వ్యాఖ్యానించారు.

నివేదికను ఆవిష్కరించిన అనంతరం రివ్కిన్ మాట్లాడుతూ.. భారతీయ చలనచిత్ర, టీవీ, స్ట్రీమింగ్ పరిశ్రమలు 2.6 మిలియన్ల ఉద్యోగాలు కల్పించాయని, వార్షిక ఆర్థిక ఉత్పత్తి ప్రకారం 60 బిలియన్ డాలర్లకు పైగా సంపదను సృష్టించాయని తెలిపారు. పెట్టుబడులు, భాగస్వామ్యాలు, ముందుచూపుతో కూడిన విధానాల కోసం కృషి చేయటం ద్వారా భారత వినోద రంగ వృద్ధిని పెంపొందించడానికి ఎంపీఏకు చెందిన స్టూడియోలు కట్టుబడి ఉన్నాయని అన్నారు.

సృజనాత్మక ఆర్థిక వ్యవస్థ విషయంలో ఎంపీఏ లక్ష్యాలు, గౌరవనీయ ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ దార్శనికత మధ్య సమన్వయాన్ని రివ్కిన్ ప్రధానంగా పేర్కొన్నారు. కథ, విజువల్ ఎఫెక్ట్స్, ప్రపంచ స్థాయి కంటెంట్ ఎగుమతిలో భారత్‌కు ఉన్న బలాలను తెలిపారు.

ఎంపీఏ నివేదికలోని ముఖ్యాంశాల ప్రజంటేషన్ వీడియోతో ఈ సెషన్ ముగిసింది. సహకారం, సృజనాత్మకత, సమ్మిళిత వృద్ధితో ముందుకు సాగే భవిష్యత్తుకు సంబంధించి విధాన రూపకర్తలు, ప్రపంచ మీడియా నాయకుల మధ్య భాగస్వామ్య దార్శనికతను ఇది సూచించింది.

# నీట్ పరీక్ష రాసిన తల్లీ, కుమార్తె..

## కాకినాడలో నీట్ కు 72 ఏళ్ల వృద్ధురాలు హాజరు..

హైదరాబాద్, మే 5: వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశాల కోసం జాతీయ స్థాయిలో నిర్వహించిన నీట్ ప్రవేశ పరీక్షలు మే 4వ తేదీ ఆదివారం దేశ వ్యాప్తంగా ప్రశాంతంగా జరిగాయి. ఈ పరీక్షలకు దేశ వ్యాప్తంగా సుమారుగా 22.3 లక్షల మంది హాజరయ్యారు. ఈ పరీక్షలకు ఓ మహిళ తన కుమార్తెతో కలిసి హాజరైంది. తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మం జిల్లాలో జరిగిన నీట్ పరీక్షల్లో వీరిద్దరూ వేర్వేరు పరీక్షా కేంద్రాల్లో పరీక్ష రాశారు.

సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం, మంచ్యానాయక్ తండాకు చెందిన భూక్యా సరిత (38) ప్రస్తుతం ఆర్ఎంపీగా పనిచేస్తున్నారు. 2007లో బీఎస్సీ నర్సింగ్ చివరి సంవత్సరంలో ఉండగా వివాహం కావడంతో పరీక్ష రాయలేకపోయారు. ఆ తర్వాత ఇద్దరు కుమార్తెలు జన్మించడంతో కోర్సును పూర్తి చేయలేకపోయారు.

అయితే, ఆమె భర్త భూక్యా కిషన్ కూడా ఆర్ఎంపీగా పనిచేస్తున్నారు. వీరిద్దరూ తమ కుమార్తెను ఎంబీబీఎస్ చదివించి డాక్టర్ చేయాలనుకున్నారు. ఖమ్మంలో కుమార్తె నీట్ శిక్షణ పొందుతున్న సమయంలో తల్లికి కూడా పరీక్ష రాయానే ఆకాంక్ష కలిగింది. దీంతో ఆమె కూడా పరీక్షకు సన్నద్ధమయ్యారు. తల్లి సరిత సూర్యాపేట ప్రభుత్వం జూనియర్ కాలేజీ పరీక్షా కేంద్రంలోనూ, కుమార్తె కావేరి ఖమ్మంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎస్ఎస్సీ క్యాంపు కేంద్రంలో పరీక్ష రాశారు.

పరీక్ష రాసిన 72 ఏళ్ల వృద్ధురాలు

.ఇక చదువుకోవాలనే ఆసక్తి ఉంటే వయసు ప్రతిబంధకం కాబోదని కాకినాడకు చెందిన 72 ఏళ్ల వృద్ధురాలు నిరూపించారు. నగరానికి చెందిన పోతుల వెంకటలక్ష్మి ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన కేంద్రంలో పరీక్ష రాశారు. ఈ వయసులోనూ ఉత్సాహంగా పరీక్ష రాయడానికి వచ్చిన బామ్మను అందరూ ఆసక్తిగా తిలకించారు. ఉన్నత చదువులపై ఈ పెద్దావిడకున్న ఆసక్తి పరీక్ష కేంద్రం వద్ద ఉన్న వారందరినీ ఆశ్చర్యపరిచింది.

# భూమిని కాపాడుదాం- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపు



హైదరాబాద్, మే 5:భూ తల్లిని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని, రైతులు యూరియా వాడకాన్ని తగ్గించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు అన్నారు. సోమవారం వికారాబాద్ జిల్లా ధారూర్‌లో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమాన్ని మంత్రి తుమ్మల ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు పెస్టిసైడ్స్ వాడకం తగ్గించాలన్నారు. శాస్త్రవేత్తలు చేస్తున్న కృషి వల్లే వ్యవసాయంలో దిగుబడి పెరిగిందని, అయితే వారు ల్యాబ్‌లలో చేస్తున్న ప్రయోగాల ఫలితాలు పొలాల్లోకి వచ్చేసరికి ఒక తరం పోతుందని ఆయన చెప్పారు.

**ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి పెట్టాలి**

ఆయిల్ పామ్ సాగుపై రైతులు దృష్టి సారించాలని మంత్రి సూచించారు. నాణ్యమైన విత్తనాలు, మొక్కలు తెప్పిస్తున్నామని, గతంలో మాదిరిగా కాకుండా ఇప్పుడు మూడేళ్లలోనే ఆయిల్ పామ్ సాగులో దిగుబడి వస్తోందన్నారు. ఆలోపు అంతర పంటలు కూడా సాగు చేసుకోవచ్చని సూచించారు. ఇప్పుడు రాష్ట్రమంతటా ఆయిల్ పామ్ సాగుకు అనుమతి ఉందన్నారు. కలెక్టర్లకు నెలకు లక్షరూపాయలే జీతం వస్తే ఆయిల్ పామ్ సాగుతో రైతులకు ఎకరానికి అన్ని ఖర్చులు పోను నెలకు రెండు లక్షలు జీతం లెక్క ఆదాయం వస్తుందన్నారు. వరి సాగులోనూ పాక్షికంగా ఆరుతడి విధానం పాటించాలన్నారు.

**పంటల బీమాను పునరుద్ధరించాలి**

గత ప్రభుత్వం పంటల బీమాను పట్టించుకోలేదని, కానీ తమ ప్రభుత్వం పంటల బీమాను మళ్లీ పునరుద్ధరించబోతుందని మంత్రి తుమ్మల చెప్పారు. ఫసల్ బీమాలో కలుస్తామని ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాశామన్నారు. పంటల బీమా ప్రీమియం అంశంపై త్వరలోనే కేబినేట్‌లో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. రాష్ట్ర ఖజానా పరిస్థితి బాగోలేదన్నారు. అయినా అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరంలో మొదటి పంటకాలంలో రూ. 33 వేల కోట్లు నేరుగా రైతుల ఖాతాల్లో వేసిన సీఎం ఈ దేశంలో రేవంత్ రెడ్డి ఒక్కరేనన్నారు.

# ప్రపంచ స్థాయిలో సృజనాత్మక సహకారానికి మార్గదర్శక ఆరంభం

న్యూఢిల్లీ, మే 5:2025 మే 1 నుంచి 3 వరకు ముంబైలో జరిగిన వేవ్స్ బజార్ తొలి ఎడిషన్ విజయవంతంగా ముగిసింది. సృజనాత్మక రంగాల్లో అంతర్జాతీయ వ్యాపార భాగస్వామ్యాలకు ఇది ప్రముఖ వేదికగా నిలిచింది. వరల్డ్ ఆడియో విజువల్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ సమ్మిట్ ( వేవ్స్) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ మార్కెట్ విభాగంలో సినిమాలు, సంగీతం, రేడియో, వీఎఫ్ఎక్స్, యానిమేషన్ రంగాల్లో 800 కోట్ల రూపాయలకు పైగా వ్యాపార లావాదేవీలు నమోదయ్యాయి. ఒప్పందాలు ఇంకా కొనసాగుతుండటంతో, మొత్తం విలువ మరి కొన్ని రోజుల్లో 1000 కోట్ల రూపాయలను మించవచ్చని అంచనా.

వేవ్స్ బజార్ లో ప్రధాన ఆకర్షణగా నిలిచిన కొనుగోలుదారులు–అమ్మకందారుల మార్కెట్ లో 3,000 పైగా బి2బి సమావేశాలు జరిగాయి. రూ.500 కోట్లు పైగా ఆదాయాన్ని రాబట్టింది. అలాగే వచ్చే రోజుల్లో మరిన్ని ఒప్పందాలు ఖరారు కావచ్చని అంచనా వేస్తున్నారు. 80 సీట్ల స్థలంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన చిత్రాల ప్రదర్శనకు విశేష స్పందనలు, ఎంపికైన సినిమాలకు ప్రశంసలు లభించాయి. ప్రతిభావంతులైన సృష్టికర్తలను తమ ఐపీలను ప్రపంచవ్యాప్తంగా ఉన్న కొనుగోలుదారుల, భాగస్వాముల ముందు ప్రదర్శించడంలో బజార్ సహాయపడింది, ఇది గణనీయమైన ఆసక్తిని సృష్టించి, కొత్త భాగస్వామ్యాలను పెంపొందించింది.

భారత్ – న్యూజీలాండ్ మధ్య అంతర్జాతీయ భాగస్వామ్యాలలో ఒక ప్రధాన పురోగతిగా, ఫిల్మ్ ఇండియా స్క్రీన్ కలెక్టివ్, పెట్రీనా డి'రోజారియో నేతృత్వంలోని స్క్రీన్ కాన్టబరీ ఎన్ జెడ్ కలసి వేవ్స్ నుంచి ప్రేరణ పొందిన ఒక భాగస్వామ్య ప్రతిపాదనను ప్రకటించాయి. ఈ ప్రతిపాదన ప్రకారం న్యూజీలాండ్‌లో తొలి భారతీయ చలనచిత్రోత్సవం ప్రారంభిస్తారు. ఇది రెండు దేశాల మధ్య పర్యాటక, సాంస్కృతిక మార్పిడి, కో ప్రొడక్షన్ సంబంధాలను మరింత బలోపేతం చేయడంపై దృష్టి సారిస్తుంది.

భారత్–రష్యా సహకారం దిశగా ఒన్లీ మచ్ లౌడర్ (ఓఎమ్ఎల్) సీఈఓ తుషార్ కుమార్, గజ్‌ప్రామ్ మీడియా సీఈఓ అలెక్సాండర్ జరోవ్ వివిధ సాంస్కృతిక ఉత్సవాలపై సహకరించే ఒప్పందం గురించి ముందస్తు చర్చలు చేపట్టారు. ఈ చర్చలు రష్యా లోనూ, భారత్ లోనూ హాస్య, సంగీత ప్రదర్శనలను కలిసి నిర్వహించడంపై దృష్టి పెట్టాయి.

ప్రధాన ఒప్పందాల ప్రకటనలు

ప్రైమ్ వీడియో, సిజె ఇఎన్ఎం మధ్య బహుళ శతాబ్ది సహకారాన్ని ప్రకటించడం బజార్‌లో ఒక ముఖ్యమైన ఘట్టంగా నిలిచింది, ఈ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ప్రపంచవ్యాప్తంగా ప్రీమియం కొరియన్ కంటెంట్ ను పంపిణీ చేసేందుకు ఉద్దేశించారు. 2025 జూన్‌లో హెడ్ ఓవర్ హీల్స్ ద్వారా ప్రారంభమయ్యే ఈ ఒప్పందం, 240 పైగా దేశాల్లో స్ట్రీమింగ్‌ను కలిగి ఉంటుంది, ఇందులో 28 ఉపశీర్షిక భాషలు, 11 డబ్బింగ్ వెర్షన్లు ఉంటాయి. ఈ ప్రణాళిక, ప్రపంచ స్ట్రీమింగ్ వేదికలపై పెరుగుతున్న ఆసియా సృజనాత్మక ప్రాతినిధ్యాన్ని చాటిచెబుతుంది.

బజార్‌కు విలువను చేకూర్చిన మరో ముఖ్యమైన అంశం దేవీ చౌధురాణి సినిమా ప్రకటన. ఇది భారతదేశ తొలి అధికారిక ఇండో–యూకే సంయుక్త నిర్మాణంగా నిలుస్తుంది. సమాచార, ప్రసార మంత్రిత్వశాఖ, ఎన్ఎఫ్డిసి, ఎఫ్పిఒ, ఇన్వెస్ట్ ఇండియా మద్దతుతో ఈ సినిమా రూపొందుతోంది. ఈ చిత్రానికి సంబంధించిన ఒక ప్రీ–టీజర్‌ను బజార్‌లో ఆవిష్కరించారు. సన్యాసి–ఫకీర్ తిరుగుబాటు కాలాన్ని ఆధారంగా చేసుకున్న ఈ చారిత్రక చిత్రంలో ప్రొసేన్ జిత్ చటర్జీ, స్రబంతి చటర్జీ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. సంగీతాన్ని పండిట్ బిక్రమ్ ఘోష్ అందిస్తున్నారు.

'వయొలేటెడ్' అనే ఫీచర్ ఫిల్మ్ ప్రారంభాన్ని ప్రకటించడం కూడా వేవ్స్ బజార్ లక్ష్యాన్ని సమర్థించే మరో ప్రయత్నం. సాహసోపేత మానసిక థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఈ చిత్రం, డింపుల్ దుగర్ తొలి దర్శకత్వ చిత్రంగా ముద్ర వేసుకుంది. మహిళా ఆధిపత్య ప్రాధాన్యత గల కథనంతో ప్రశంసలు పొందిన ఈ చిత్రాన్ని యూకేకి చెందిన ఫ్యూషన్ ఫ్లిక్స్, జెవీడి ఫిల్మ్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ సినిమా ద్వారా డింపుల్ దుగర్ వాణిజ్య విభాగం నుంచి ఫీచర్ ఫిల్మ్ నిర్మాణంలోకి దూసుకెళ్లిన మార్గాన్ని సూచిస్తుంది.

ప్రభావవంతమైన ఆరంభంతో, వేవ్స్ బజార్ ప్రపంచవ్యాప్తంగా సృజనాత్మక సహకారం కోసం ఒక కేంద్రంగా నిలిచింది. అంతేకాకుండా ఇది సరిహద్దులను దాటిన కథలు చెప్పే కొత్త యుగానికి, చిత్రపరిశ్రమలో మార్పుకు వేదికను సృష్టించింది.

# పారిశ్రామికవేత్తలను తయారు చేద్దాం- కలెక్టర్ లక్ష్మీశ



అమరావతి, మే 5:సీఎం చంద్రబాబు స్వర్ణాంధ్ర ఏ 2047 దార్శనికతకు అనుగుణంగా, ప్రతి కుటుంబం నుంచి ఒకరు పారిశ్రామికవేత్తగా ఎదగాలనే ప్రభుత్వ లక్ష్యాలను నెరవేర్చేలా ముఖ్యంగా యువత, మహిళలకు ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలపై పెద్దఎత్తున అవగాహన కల్పించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ పరిశ్రమల శాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) సందర్భంగా జిల్లా పరిశ్రమల శాఖ అధికారులు ఎంఎస్ఎంఈ థీమ్ స్టాల్‌ను ఏర్పాటు చేశారు. కలెక్టర్ లక్ష్మీశ స్టాల్‌ను ప్రారంభించి, స్టాల్ ద్వారా ప్రజలకు అందించాల్సిన సేవలపై దిశానిర్దేశం చేశారు. పారిశ్రామిక రంగానికి సంబంధించిన పథకాలు, కార్యక్రమాలపై రూపొందించిన కరపత్రాలను పరిశీలించారు.

ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పారిశ్రామిక యూనిట్‌ను ప్రారంభించి తన కాళ్లపై తాను నిలబడడంతో పాటు మరో పది మందికి ఉపాధి కల్పించాలనుకునే ఔత్సాహికులకు పారిశ్రామిక విధానాలు, అనుమతుల మంజూరు ప్రక్రియ, మౌలిక సదుపాయాలు, వినూత్న వాణిజ్య అవకాశాలు, ప్రాజెక్టుల రూపకల్పన, రుణాలతో పాటు వివిధ వనరుల పరంగా మద్దతు లభించే పీఎంఈజీపీ, ముద్రా, పీఎం విశ్వకర్మ, ఎంఎస్ఎంఈ ప్రోత్సాహకాలు తదితరాలపై అవగాహన కల్పించాలన్నారు. పారిశ్రామిక యూనిట్‌ను విజయవంతంగా ముందుకు తీసుకెళ్లేందుకు అవసరమైన శిక్షణ కూడా ఇవ్వాలన్నారు.ఆధునిక మార్కెటింగ్ సౌకర్యాలపైనా అవగాహన కల్పించాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో స్టాల్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రకృతి సేద్యం ఉత్పత్తులు, చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాల ద్వారా ఉత్పత్తి చేసిన సేంద్రియ ఎరువుల స్టాల్‌ను కూడా కలెక్టర్ లక్ష్మీశ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల అధికారి బి.సాంబయ్య, డీపీవో పి.లావణ్య కుమారి, గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి.జ్యోతి, జిల్లా వ్యవసాయ అధికారి డీఎంఎఫ్ విజయకుమారి, డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వీ నాంచారయ్య, పీసీబీ ఈఈ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

# భగీరథుని కఠోర శ్రమ, దీక్ష మరువలేనిది : మంత్రి సవిత



విశాఖపట్నం, మే 4 : భగీరథ మహర్షి మహాజ్ఞాని అని, పరోపకారానికి, దీక్షకు, సహనానికి ప్రతిరూపమని ఎంత కష్టాన్నైనా లెక్కచేయకుండా అనుకున్నది సాధించే వారని వెనుకబడిన తరగతుల సంక్షేమం, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల సంక్షేమం, చేనేత, జౌళిశాఖ మంత్రి ఎస్.సవిత పేర్కొన్నారు. భగీరథుని వారసులుగా సగరులు ఎంతో పట్టుదల, శ్రమ, నిజాయితీతో ఉంటారని కొనియాడారు. భగీరథుని ఆశయాలను కొనసాగించాలని, ఆయన చూపిన సంకల్ప బలంతో బీసీ వర్గాల్లోని సామాన్యులు ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఆదివారం ఉదయం 71వ వార్డు, గాజువాక దుర్గానగర్ లో ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి భగీరథ జయంతి కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. భగీరథ మహర్షి జయంతి మహోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన భగీరథ మహర్షి విగ్రహావిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ముందుగా మంత్రి ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి భగీరథుని విగ్రహాన్ని ఆవిష్కరించారు.

అనంతరం జరిగిన సభా కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ భగీరథుని ఆశయాలను కొనియాడారు. ఆయన చేసిన కఠోర శ్రమ, చూపిన దీక్ష ఎప్పటికీ మరువలేనిదన్నారు. భగీరథుని ఆశయాలను కొనసాగించాలని, ఆయన చూపిన సంకల్ప బలంతో బీసీ వర్గాల్లోని సామాన్యులు ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి బీసీలను అన్ని రంగాల్లో ముందు నిలబెట్టేందుకు కృషి చేస్తున్నారని, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల్లో బీసీలు అధికంగా లబ్ధి పొందుతున్నారని తెలిపారు. బీసీలు అభివృద్ధి చెందడానికి చదువు ప్రాముఖ్యతను నొక్కిచెప్పారు. ఉప్పర కులాన్ని సగరుగా మార్చేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

స్థానిక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస రావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆదేశాలతో ఈ కార్యక్రమం ఇక్కడ జరగడం ఆనందంగా ఉందన్నారు. చరిత్రను తరతరాలకు అందించే ముఖ్యమంత్రి నిర్ణయాన్ని ప్రజలందరూ స్వాగతిస్తున్నారని తెలిపారు. భగీరథుడు మానవాళికి చేసిన కృషిని అందరూ గుర్తుంచుకోవాలని, ఆయన వారసులుగా ఆ కృషిని ఎప్పటికీ మరవకూడదని సూచించారు. ఈ ప్రాంతంలో పార్కు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.

బీసీ వెల్ఫేర్ సెక్రెటరీ ఎస్ సత్యనారాయణ మాట్లాడుతూ భగీరథుని వారసులుగా ఒకప్పుడు ముందున్న సగరులు ప్రస్తుతం వెనుకబడి ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళల అక్షరాస్యత ఆవశ్యకతను ఆయన నొక్కిచెప్పారు. ప్రభుత్వం బీసీలకు సుమారు 2000 కోట్ల రూపాయల రుణాలు అందించేందుకు చర్యలు తీసుకుంటుందని, వెనుకబడిన తరగతుల కోసం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బీసీ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఏ.మల్లికార్జున మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీసీల కోసం ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందని తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన వారి అభివృద్ధికి, ఉత్పాదకత పెంపునకు ఆదరణ 3 పేరుతో 18రకాల వృత్తుల వారికి పనిముట్లు అందించే కార్యక్రమాన్ని త్వరలో ప్రారంభిస్తామని ఆయన వెల్లడించారు. అర్హులైన లబ్ధిదారులు బీసీ కార్పొరేషన్‌ను సంప్రదించాలని సూచించారు.

జిల్లా కలెక్టర్ ఎం.ఎన్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ భగీరథుని కఠోర శ్రమ, కష్టపడే తత్వాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. వెనుకబడిన తరగతుల సంక్షేమం కోసం ప్రభుత్వం చేస్తున్న కృషిని వివరించారు. జిల్లాలో 60కోట్ల రూపాయల అంచనాలతో 2500 యూనిట్లు మంజూరు చేయనున్నారని, ఇప్పటికే 400 యూనిట్లు గుర్తించామని తెలిపారు. పేదలకు మెరుగైన జీవనం అందించేందుకు 'బంగారు కుటుంబం' వంటి కార్యక్రమాలు అమలు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. విశాఖపట్నంలో 73వేల బంగారు కుటుంబాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ అధికారిణి శ్రీదేవి, స్థానిక కార్పొరేటర్లు, వార్డు సభ్యులు, బీసీ సంఘం నాయకులు, ప్రజలు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


# ఎన్నికల్లో విజయంపై శ్రీ లారెన్స్ వాంగ్‌కు భారత ప్రధాని అభినందనలు

న్యూఢిల్లీ, మే 5:ఎన్నికల్లో విజయం సాధించిన శ్రీ లారెన్స్ వాంగ్‌కు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అభినందనలు తెలిపారు.

భారత్ – సింగపూర్ మధ్య సన్నిహిత ప్రజా సంబంధాల ద్వారా బలమైన, బహుముఖీనమైన భాగస్వామ్యం నెలకొని ఉన్నదని ఆయన పేర్కొన్నారు.

"సార్వత్రిక ఎన్నికల్లో అద్భుతమైన విజయం సాధించిన కు హృదయపూర్వక అభినందనలు.

సన్నిహిత ప్రజా సంబంధాల ఆధారంగా భారత్, సింగపూర్ మధ్య బలమైన, బహుముఖీనమైన భాగస్వామ్యం ఉంది. మన సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లే దిశగా మీతో కలిసి పనిచేయడం కోసం నేను ఎదురుచూస్తున్నాను."

గోవిందరాజు సీతాదేవి సాహితీ వేదిక
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా
గోవిందరాజు సీతాదేవి
జాతీయస్థాయి సాహితీ పురస్కారం 2024
పురస్కార ప్రదానోత్సవ సభ
తేదీ: 10.5.2025, శనివారం. ఉదయం 9 గంటలకు
వేదిక: డాక్టర్ ఎస్ఆర్‌కే విశ్వసాయి స్కూలు (ఏసీ హాలు), మాగుంట లేఅవుట్, నెల్లూరు
సభాధ్యక్షత:
శ్రీమతి గోవిందరాజు సుభద్రా దేవి
ముఖ్యఅతిథి:
శ్రీ అద్దేపల్లి ప్రభు, ప్రముఖ కవి, కథకులు, కాకినాడ
అతిథులు:
డాక్టర్ సుంకర గోపాల్, ప్రముఖ కవి, తాడేపల్లిగూడెం
డాక్టర్ పెళ్లూరు సునీల్, ప్రముఖ కవి, కోట
శ్రీమతి ఎస్.వి.ఎం. నాగ గాయత్రి, ప్రముఖ రచయిత్రి, నెల్లూరు
పురస్కార గ్రహీతలు:
నవల: శ్రీ ఆర్.సి. కృష్ణస్వామి రాజు గారి 'మేకలబండ', తిరుపతి
కథాసంపుటి : శ్రీ కె.ఎ.మునిసురేష్ పిళ్లె గారి 'గారడీవాడు', శ్రీకాళహస్తి/హైదరాబాదు
కవిసమ్మేళనం:
ఉదయం 9 గంటలకు. ముగ్గురు విజేతలకు నగదు బహుమతులు
విందు : మధ్యాహ్నం 1 గంటకు (సభ వద్దనే)
సాహిత్యాభిమానులు తప్పకుండా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయగలరు.
ఇట్లు.. గోవిందరాజు సుభద్రా దేవి
గోవిందరాజు సీతాదేవి సాహితీ వేదిక వ్యవస్థాపక అధ్యక్షురాలు, నెల్లూరు 98486 27158

# యువతకు గ్రీన్ ఎనర్జీలో శిక్షణ కోసం ష్నైడర్ ఎలక్ట్రిక్ తో ఏపి ప్రభుత్వం ఒప్పందం



అమరావతి, మే 5: ఎలక్ట్రానిక్స్, గ్రీన్ ఎనర్జీ, నిర్మాణ రంగాల్లో వేగవంతంగా అభివృద్ధి చెందుతున్న అధునాతన సాంకేతికతను అందిపుచ్చుకొని యువతకు ఉపాధి అవకాశాలు పెంచడమే లక్ష్యంగా నైపుణ్య శిక్షణ మౌలిక సదుపాయాలను మెరుగుపర్చడానికి రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ చొరవతో ఏపి ప్రభుత్వం, ష్నైడర్ ఎలక్ట్రిక్ నడుమ ఒక అవగాహన ఒప్పందం కుదిరింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ , ష్నైడర్ ఎలక్ట్రిక్ ఇండియా ఫౌండేషన్ ప్రతినిధులు నేడు ఎంఓయుపై సంతకాలు చేశారు.

ఎలక్ట్రానిక్స్, గ్రీన్ ఎనర్జీ, నిర్మాణ రంగాల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయి అవకాశాలను అందుపుచ్చుకునేందుకు ప్రతిభావంతులైన బృందాలను తయారు చేయడమే ఈ ఒప్పందం లక్ష్యం. ఒప్పందం ప్రకారం ఈ ఏడాది ఏప్రిల్ నుంచి మార్చి, 2027వరకు ప్రభుత్వ ఐటీఐలు, పాలిటెక్నిక్ కళాశాలలు, ఔంఅ శిక్షణా కేంద్రాల్లో 20 అధునాతన ట్రైనింగ్ ల్యాబ్ లను ఏర్పాటుచేస్తారు. ఈ ల్యాబ్ లు అత్యాధునిక విద్యుత్, సౌరశక్తి వ్యవస్థలు, పారిశ్రామిక ఆటోమేషన్ పరికరాలను కలిగి ఉంటాయి. పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా ప్రపంచస్థాయి ప్రమాణాలతో 9వేల మంది యువతకు శిక్షణ ఇస్తారు. శిక్షణా పరికరాలు, వినియోగ వస్తువులు, డిజిటల్ సామగ్రి కోసం ష్నైడర్ ఎలక్ట్రిక్ ఇండియా ఫౌండేషన్ సుమారు రూ. 5కోట్లు ఖర్చుచేస్తుంది. శిక్షణ పొందిన అభ్యర్థులకు ప్లేస్‌మెంట్ మద్దతు కూడా ఫౌండేషన్ అందిస్తుంది.

మంత్రి నారా లోకేష్ విజ్ఞప్తి మేరకు రూ.15 కోట్ల అంచనా తో మంగళగిరి లో ష్నైడర్ ఎలక్ట్రిక్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు కు కంపెనీ అంగీకారం తెలిపింది. అనంతపురం లో ష్నైడర్ ఎలక్ట్రిక్

రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు చేయనున్నారు, అల్లూరి సీతారామరాజు జిల్లా లో ష్నైడర్ ఎలక్ట్రిక్ మోడ్రన్ పవర్ ఆప్టిమైజేషన్ పైలెట్ ప్రాజెక్టు నిర్వహించనున్నారు.

స్కిల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ మౌలిక సదుపాయాలను కల్పించి విద్యార్థులను శిక్షణ కార్యక్రమాలపై చైతన్యవంతం చేస్తుంది. శిక్షణ కార్యక్రమాల కోసం 4 న్యాక్ సెంటర్లు (అమరావతి, కుప్పం, డిజిటల్ కమ్యూనిటీ భవన్-ఖఓ లంక, చిత్తూరు), 9 ప్రభుత్వ ఐటిఐలు (అరకు, రాజమండ్రి (బాలికలు), నర్సీపట్నం, నూజివీడు, ఒంగోలు (బాలుర), ఎ.ఎన్. పేట, కార్వేటినగరం (బాలికలు), కడప (మైనారిటీలు), శ్రీశైలం), 7 ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలు (శ్రీకాకుళం, గుంటూరు, అనంతపురం, చంద్రగిరి, నంద్యాల, గన్నవరం, ఒంగోలు) ఉన్నాయి.

ఆంధ్రప్రదేశ్ యువతలో నైపుణ్య అంతరాన్ని తగ్గించి గ్రీన్, డిజిటల్ ఆర్థిక వ్యవస్థ ఏర్పాటుకు ఈ ఒప్పందం దోహదపడుతుంది. ఈ కార్యక్రమంలో ఏపీఎస్ఎస్ డీసీ మేనేజింగ్ డైరెక్టర్ ఆ సి???? ఈ వో జి.గణేష్ కుమార్, ఏపీఎస్ ఎస్ డీసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె. దినేష్ కుమార్, ష్నైడర్ ఎలక్ట్రిక్ ఇండియా కంట్రీ హెడ్ ఆ మేనేజింగ్ డైరెక్టర్ దీపక్ శర్మ, సీనియర్ జనరల్ మేనేజర్ రిచా గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీలో అభివృద్ధి చెందుతున్న ఐటి పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా అడ్వాన్స్ డ్ టెక్నాలజీస్ లో యువతకు శిక్షణ ఇచ్చి, వర్క్ ఫోర్స్ ను సిద్ధం చేయడానికి ప్రఖ్యాత సంస్థ

ఒరాకిల్ ప్రభుత్వంతో నేడు ఒప్పందం చేసుకుంది. ఈ ఒప్పందం ద్వారా యువతకు ఒరాకిల్ యూనివర్సిటీ లెర్నింగ్ సబ్ స్క్రిప్షన్ కంటెంట్ ఉచితంగా లభిస్తుంది. మహిళలు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల యువతలో ఒరాకిల్ క్లౌడ్ నైపుణ్యాల కోసం చేయూత అందించడమే ఈ ఒప్పందం ముఖ్యోద్దేశం. మూడేళ్లలో మొత్తం 4లక్షలమందికి ఒరాకిల్ మైలెర్న్ డిజిటల్ ప్లాట్ ఫాం ద్వారా శిక్షణ అందించడం జరుగుతుంది.

# రేపు కూసుమంచిలో కాంగ్రెస్ పార్టీ పాలేరు నియోజకవర్గ సన్నాహక సమావేశం

**– ముఖ్యఅతిధులుగా హాజరు కానున్న రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఖమ్మం జిల్లా పీసీసీ అబ్జర్వర్ నాయిని రాజేందర్ రెడ్డి, డీసీసీ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్**

ఖమ్మం, మే 5 (నేటినిజం ప్రతినిధి) : కాంగ్రెస్ పార్టీ సంస్థగత నిర్మాణంపై పాలేరు నియోజకవర్గ సన్నాహక సమావేశం కూసుమంచి మండల కేంద్రంలోని ఎస్ఆర్ ఫంక్షన్ హాల్లో ఈనెల 6వ తేదీన మంగళవారం (రేపు) మధ్యాహ్నం 12గంటలకు జరగనుంది. ఈ మేరకు మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా స్థానిక ఎమ్మెల్యే, తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే, ఖమ్మం జిల్లా పీసీసీ అబ్జర్వర్ నాయిని రాజేందర్ రెడ్డి, డీసీసీ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ హాజరవుతారని తెలిపారు. కావున ఖమ్మం రూరల్, ఏదులాపురం మున్సిపాలిటీ, కూసుమంచి, తిరుమలాయపాలెం, నేలకొండపల్లి మండలాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, మార్కెట్ కమిటీల, ఆత్మకమిటీ, సీడీసీ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, డైరెక్టర్లు అందరూ సకాలంలో హాజరుకావాలని దయాకర్ రెడ్డి కోరారు.


# నక్సల్స్ తో చర్చలు జరపాలని చెప్పడం ఆ పార్టీ రెండు నాల్కల ధోరణికి నిదర్శనం- బండి సంజయ్



పెద్దపల్లి, మే 5: నక్సల్స్ పై నిషేధం విధించిన కాంగ్రెస్ పార్టీయే ఈరోజు నక్సల్స్ తో చర్చలు జరపాలని చెప్పడం ఆ పార్టీ రెండు నాల్కల ధోరణికి నిదర్శనమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మండిపడ్డారు. సోమవారం పెద్దపల్లి జిల్లా ఎన్టీపీసీ అతిథి గృహంలో మీడియాతో మాట్లాడుతూ తుపాకీ చేతపట్టి అమాయకులను చంపుతుంటే సామాజిక కోణంతో చూడాలనడం బాధాకరమన్నారు. తుపాకీ పట్టి చంపేటోళ్లతో చర్చలేందని ప్రశ్నించారు. దశాబ్దాలుగా నక్సల్స్ చేసిన హింసతో ఎంతో మంది చనిపోయారని, నెత్తురోడిన ఎన్నో దృశ్యాలను చూసిన ప్రొఫెసర్ హరగోపాల్, వరవరరావు సాధించిందేమిటో చెప్పాలన్నారు. నక్సల్స్ తుపాకీ వీడి లొంగిపోవాల్సిందేనని, జనజీవన స్రవంతిలో కలవాల్సిందేనని ఉద్ఘాటించారు.

ఈవిషయంలో హరగోపాల్, వరవరరావుసహా పౌరహక్కుల సంఘం నేతలే నక్సల్స్ కు నచ్చజెప్పాలని సూచించారు. కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం గత 10 ఏళ్లలో తెలంగాణ అభివృద్ధి కోసం రూ.12లక్షల కోట్లకు పైగా ఖర్చు చేసిందన్నారు. ఒక్క నేషనల్ హైవేస్ అభివృద్ధి కోసమే 1 లక్షా 25 వేల 485 కోట్ల ఖర్చు చేసినామని, ఇవిగాక రైల్వేల అభివృద్ధికి రూ.32వేల కోట్లు ఖర్చు చేశామన్నారు. వడ్ల కొనుగోలు కోసమే లక్షనర్న కోట్ల రూపాయల దాకా ఖర్చు చేశామని, మేం ఇంత చేసినా కేంద్రం నయాపైసా ఇయ్యలేదని కాంగ్రెస్ దుష్ప్రచారం చేస్తోందన్నారు. కేంద్రం ఖర్చు చేసిన నిధులపై లెక్కా పత్రంతో సహా వివరిస్తామని, చర్చకు రావాలని కోరినా వాళ్లు రావడం లేదన్నారు.

# ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌ని కలిసిన వేల్పుల మురళి



ఖమ్మం, మే 5 (నేటినిజం ప్రతినిధి) : తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ని సోమవారం హైదరాబాదులో నాగరి ప్రీతం ని దళితరత్న అవార్డు గ్రహీత, వైరా మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్, జిల్లా కాంగ్రెస్ నాయకులు వేల్పుల మురళి మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈ సందర్భంగా వేల్పుల మురళి మాట్లాడుతూ...రాజీవ్ యువ వికాస పథకంలో ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరగాలని ఈ బడ్జెట్లో వర్గీకరణ అమలయ్యే విధంగా కృషి చేయాలని రుణాలు మంజూరు చేసి త్వరగా లబ్ధిదారులను ఎంపిక చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కొమిరే నాగేశ్వరావు, రమేష్, చందు, తదితరులు పాల్గొన్నారు.

# ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌కు బీహార్ ఆతిథ్యమిచ్చి, ప్రధాని శ్రీ మోదీ క్రీడా దార్శనికతను ఓ మెట్టు పైకి తీసుకువెళ్లింది: డాక్టర్ మన్‌సుఖ్ మాండవియా

న్యూఢిల్లీ, మే 5:ఖేలో ఇండియా యూత్ గేమ్స్ ఏడో సంచికను మాన్య ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ వర్చువల్ పద్ధతిలో ఈ రోజు బీహార్‌లో ప్రారంభించారు. ఈ గేమ్స్‌లో పతకాలను ప్రదానం చేసేందుకు ఉద్దేశించిన 27 క్రీడావిభాగాలతో పాటు ప్రదర్శన పద్ధతి (డెమాన్‌స్ట్రేషన్ స్పోర్ట్)లో మరో క్రీడ భాగంగా ఉంటాయి. ఈ క్రీడలు ఈ నెల 15న ముగుస్తాయి.

ప్రధాని శ్రీ మోదీతో పాటు బీహార్ ముఖ్యమంత్రి గౌరవనీయులు శ్రీ నీతీశ్ కుమార్, కేంద్ర క్రీడలు, యువజన వ్యవహారాల శాఖ మంత్రి మాన్య డాక్టర్ మన్‌సుఖ్ మాండవీయ, కేంద్ర సహాయ మంత్రి మాన్య శ్రీమతి రక్షా ఖడ్సేలతో పాటు బీహార్ ప్రభుత్వానికి, బీహార్ రాష్ట్ర క్రీడా ప్రాధికరణ సంస్థకు చెందిన అనేక మంది ఉన్నతాధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

బీహార్ నిర్వహిస్తున్న మొట్టమొదటి ప్రధాన బహు విభాగాల క్రీడా కార్యక్రమమిది. పతకాలను ప్రదానం చేసేందుకు ఉద్దేశించిన 27 క్రీడావిభాగాలను పాట్నా, రాజ్‌గీర్, భాగల్పూర్, గయ, బెగూసరాయి.. ఈ అయిదు నగరాల్లోనూ, న్యూఢిల్లీలోనూ నిర్వహిస్తున్నారు. తొలిసారిగా కేఐవైజీ (ఖేలో ఇండియా యూత్ గేమ్స్) ప్రోగ్రాములో సేపక్ తక్రాను పతక క్రీడావిభాగంగా చేర్చారు. ఇ-స్పోర్ట్స్‌ను ప్రదర్శన ఈవెంట్ గా ఏర్పాటు చేస్తున్నారు. కేఐవైజీ 2025లో 6,000 మందికి పైగా అథ్లెట్లు సహా 10,000 మందికి పైగా పాల్గొంటారు.

ఈ ఏడాది మార్చి నెలలో పాట్నాలో అంతర్జాతీయ సేపక్‌తక్రా సమాఖ్య (ఐఎస్‌టీఏఎఫ్) ప్రపంచ కప్‌లో భారతీయ పురుషుల రెగు (ముగ్గురు ప్లేయర్ల) జట్టు తన మొట్టమొదటి బంగారు పతకాన్ని సాధించిన సంగతిని ప్రస్తావించడం ఈ సందర్భంగా సముచితం.

ఈ విజయం దేశవ్యాప్తంగా ఉత్సవాలకు నాంది పలికింది. మాన్య ప్రధాన మంత్రి తన శుభాకాంక్షలను తెలియజేశారు. పాటలీపుత్ర స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో చేజిక్కిన ఈ గెలుపు ఐఎస్‌టీఏఎఫ్ ప్రపంచ కప్‌లో భారత్ అత్యుత్తమ ప్రదర్శనకు సంకేతంగా ఉంది. ఈ క్రీడాంశంలో నాలుగు ఖండాల నుంచి 21 దేశాలు మొత్తం ఏడు ఈవెంట్లలో పోటీపడ్డాయి.

డాక్టర్ మాండవియా మాట్లాడుతూ "ఇది బీహార్‌కు చాలా ముఖ్యమైన కాలం. నలందా, విక్రమ్‌శిల ప్రధాన జ్ఞాన కేంద్రాలుగా ఎలా విరాజిల్లాయో చరిత్రను పరిశీలించి తెలుసుకోవచ్చు. ఇప్పుడు ఇదే గడ్డ మనకు కొత్త క్రీడాభివృద్ధి కేంద్రాలను ప్రసాదిస్తోంది. ఇది బీహార్ ఎంతో గర్వపడాల్సిన విషయం" అన్నారు.

ఆయన ఇంకా ఇలా అన్నారు.. "ప్రధాన ఈవెంట్లను విజయవంతంగా నిర్వహించగల సామర్థ్యం ఉన్న రాష్ట్రంగా బీహార్ ఇమేజిని తీర్చిదిద్దడానికి ఈ గేమ్స్ ఒక అవకాశాన్ని ప్రసాదిస్తున్నాయి. వికసిత్ భారత్‌లో 'వికసిత్ బీహార్' ఒక భాగంగా ఉంటుంది. బీహార్‌లో ప్రతి క్రీడా ప్రతిభాశాలికి ఇక ఒక వేదికతోపాటు తమ నైపుణ్యాలను ప్రదర్శించడానికి ఒక అవకాశం కూడా అందివస్తుంది. భారత్ నిర్వహించాలని తపిస్తున్న 2026 వేసవి ఒలింపిక్స్‌లో రాణించాలంటే ప్రతిభకు సరి అయిన విధంగా పదును పెట్టడం అనేది కీలకం".

ఖేలో ఇండియా ప్రోగ్రామ్‌లో బీహార్‌ది ఓ ముఖ్య పాత్ర. దేశం అంతటా 1048 ఖేలో ఇండియా సెంటర్లు ఉంటే, 38 ఖేలో ఇండియా సెంటర్లను బీహార్‌లోని అన్ని జిల్లాలలోనూ ఏర్పాటు చేశారు. ఇదివరకు విజేతలుగా ఉన్న క్రీడాకారులు సారథ్యం వహిస్తున్న ఈ కేంద్రాలు క్రీడల పట్ల ఉద్వేగం కలిగి ఉన్న పలువురికి క్షేత్రస్థాయిలో మార్గదర్శనం చేస్తున్నాయి.

ఈ ఖేలో ఇండియా సెంటర్లు టేబుల్ టెన్నిస్, అథ్లెటిక్స్, రెజ్లింగ్, ఫుట్‌బాల్, హాకీ, వెయిట్‌లిఫ్టింగ్, విలువిద్య, బాక్సింగ్, కబడ్డి, వుషు వంటి అనేక క్రీడాంశాల్లో శిక్షణావకాశాలు కల్పిస్తున్నాయి. ఈ కేంద్రాల్లో మొత్తం 939 మంది అథ్లెట్లు ప్రస్తుతం శిక్షణ పొందుతున్నారు. వారిలో 473 మంది పురుషులు. 466 మంది మహిళలు. అదనంగా, 34 ఖేలో ఇండియా స్టేట్ ఎక్సలెన్స్ సెంటర్లను రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో దేశవ్యాప్తంగా ఏర్పాటు చేశారు.

క్రీడల్లో బీహార్ క్రమంగా మెరుగైన ఫలితాలను సాధిస్తోందనడానికి ఉత్తరాఖండ్‌లో నిర్వహించిన నేషనల్ గేమ్సే ఒక సూచిక. ఆ నేషనల్ గేమ్స్‌లో బీహార్ 12 పతకాలు గెలిచింది. వాటిలో ఒక బంగారు పతకం కూడా ఉంది. నేషనల్ గేమ్స్‌లో బీహార్ కనబరచిన అత్యుత్తమ ప్రదర్శన ఇది.

డాక్టర్ మాండవీయ మాటలలో చెప్పాలంటే "బీహార్ క్రీడారంగంలో మంచి రోజులు మొదలయ్యాయి. ప్రధాని శ్రీ మోదీ కూడా ఇదే సరి అయిన తరుణమని విశ్వసిస్తున్నారు. ఇదంతా సాధ్యమైందంటే అందుకు సువ్యవస్థిత శిక్షణ, క్రీడాకారులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టడం, స్థానికంగా అందుతున్న మద్దతు.. ఇవన్నీ కూడా కారణాలే. మనం కాస్తంత ఓపిక పడితే చాలు... ప్రతిభావంతులు కాలక్రమంలో పెద్ద పేరు సంపాదిస్తారు."

డాక్టర్ మాండవీయ 'సండేస్ ఆన్ సైకిల్ కార్యక్రమం దేశం నలుమూలల పుంజుకొంటోంది. ఊబకాయం వంటి జీవనశైలి సమస్యలను తప్పించుకోవాలంటే ఫిట్‌నెస్ పట్ల అవగాహన తప్పనిసరి'' అని పునరుద్ఘాటించారు. భవిష్యత్తులో ఖేలో ఇండియా క్యాలండర్‌లో కొత్త కొత్త ఈవెంట్లు చోటు చేసుకుంటాయని క్రీడల శాఖ మంత్రి తెలిపారు. ఈ ఈవెంట్లు మరింత మంది పాల్గొనేవిగా ఉంటాయని కూడా ఆయన అన్నారు.

రాబోయే కాలంలో ఖేలో ఇండియా స్కూల్ గేమ్స్, దీవ్‌లో బీచ్ గేమ్స్, దక్షిణ భారతదేశంలో ఖేలో ఇండియా స్వదేశీ గేమ్స్, ఛత్తీస్‌గఢ్‌లో గిరిజన గేమ్స్ వంటి వాటిని నిర్వహించనున్నట్లు డాక్టర్ మాండవియా తెలిపారు.

'ఖేలో ఇండియా' కార్యక్రమంలో ఓ భాగంగా ఖేలో ఇండియా యూత్ గేమ్స్ ను 2017 అక్టోబరు 14న ప్రారంభించారు. ప్రాతినిధ్యాన్నిపెద్ద ఎత్తున పెంచడం, మెరికల్లాంటి క్రీడాకారులను తీర్చిదిద్దడం అనే రెండూ ఖేలో ఇండియా ముఖ్యోద్దేశాలు. క్రీడారంగంలో భారత్ సాఫల్యానికి ఈ కార్యక్రమం ఎంతగానో తోడ్పడింది. ఖేలో ఇండియా దన్నుగా నిలిచిన క్రీడాకారులు, క్రీడాకారిణులు ఒలింపిక్స్, ఆసియా గేమ్స్ సహా అనేక ప్రపంచ ఈవెంట్లలో మన దేశం తరఫున పాల్గొంటున్నారు. బీహార్ ఖేలో ఇండియా యూత్ గేమ్స్ ఏడో సంచికకు ఈ నెల 4 నుంచి 15వ తేదీ వరకు ఆతిథ్యాన్నిస్తోంది. ఈ గేమ్స్‌ను బీహార్‌లోని అయిదు నగరాలతో పాటు ఢిల్లీలో నిర్వహిస్తున్నారు. మొట్టమొదటిసారిగా ఇ-స్పోర్ట్స్‌ను ప్రదర్శన పద్ధతి క్రీడ (డెమాన్‌స్ట్రేషన్ స్పోర్ట్)గా దీనిలో చేర్చారు.

# 1500 కోట్ల మనీల్యాండరింగ్ కేసులో కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే ధరమ్ సింగ్ చొకర్ అరెస్ట్

చండీఘడ్ మే 5 (ఎక్స్ ప్రెస్ న్యూస్):: కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే ధరమ్ సింగ్ చొకర్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు ఇవాళ అరెస్టు చేశారు. సుమారు 1500 కోట్ల మనీల్యాండరింగ్ కేసులో అతన్ని అదుపులోకి తీసుకున్నారు. ఢిల్లీలోని ఓ హోటల్ నుంచి అతన్ని కస్టడీలోకి తీసుకున్నారు. హర్యానాలోని సమల్కా ప్రాంతంలో మాజీ ఎమ్మెల్యే ధరమ్ సింగ్ రాజకీయాల్లో పేరుగాంచిన వ్యక్తి. ఆ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా రెండు సార్లు ఎన్నికయ్యారు. ఇదే స్కామ్‌తో లింకున్న వ్యక్తులను ఈడీ అరెస్టు చేసింది. ధరమ్ సింగ్ కుమారుడు సికందర్ చొకర్‌ను కూడా అదుపులోకి తీసుకున్నారు. భారీ స్థాయిలో అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. షెల్ కంపెనీలకు మనీల్యాండరింగ్ చేసినట్లు కూడా ఆరోపణలు ఉన్నాయి.

రియల్ ఎస్టేట్‌తో పాటు ఇతర రంగాల్లో చోటుచేసుకున్న ఆర్థిక అక్రమాల నేపథ్యంలో దర్యాప్తు చేపట్టారు. 2023లో గురుగ్రామ్ పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ విచారణ చేపట్టింది.మాజీ ఎమ్మెల్యే ధరమ్ చొకర్ అతని కుమారులు ఇద్దరు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేశారు. 1500 ఇండ్లు కట్టిస్తామని చెప్పి సుమారు 363 కోట్లు వసూల్ చేశారు. గురుగ్రామ్‌లో సెక్టార్ 68లో ఇండ్ల నిర్మాణం చేపట్టనున్నట్లు చెప్పారు.

2021-22 నాటికి ఇండ్లను కట్టిస్తామని హామీ ఇచ్చారు. కానీ ఆ కమిట్‌మెంట్‌కు కట్టుబడి లేరు. మహిర గ్రూపునకు వ్యతిరేకంగా ధర్నాలు, ఆందోళనలు జరిగాయి. కంపెనీ డైరెక్టర్లు డబ్బును అక్రమంగా తరలించినట్లు ఈడీ ఆరోపించింది. నిర్మాణ ఖర్చులకు చెందిన నకిలీ పత్రాలు చూపించారు. ఫేక్ బిల్లులు, ఇన్‌వాయిస్‌లు చూపించి.. మహిరా డైరెక్టర్లు ఆ డబ్బును వ్యక్తిగత అవసరాలకు వాడినట్లు ఆరోపణలు వస్తున్నాయి.

మహిర గ్రూపునకు చెందిన వాహనాలు, నగదు, బంగారం, నగలను 2023 జూలైలో సీజ్ చేశారు.

2009లో తొలిసారి హర్యానా జనహిత్ కాంగ్రెస్ టికెట్‌పై పోటీ చేసి గెలిచారు. ఇక ఆ తర్వాత కాంగ్రెస్‌లో చేరారాయన. 2014లో ఆయన ఎన్నికల్లో ఓడిపోయారు. మళ్లీ 2019లో సమల్కా నుంచి ఆయన గెలిచారు.

# మెటర్నిటీ లీవ్స్‌ను 180 రోజులకు పెంచిన ఏ పి ప్రభుత్వం

అమరావతి మే 5 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );మహిళా ప్రభుత్వ ఉద్యోగులకు ఏపీ ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. మాతృత్వ సెలవులను పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం 120 మెటర్నిటీ లీవ్స్ ఇస్తుండగా.. వాటిని 180 రోజులకు పెంచింది. ఈ మేరకు సోమవారం నాడు రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేసింది.గతంలో ఇద్దరు పిల్లలకు మాత్రమే ప్రసూతి సెలవులు వర్తించేవి. కానీ తాజాగా విడుదల చేసిన జీవోలో ఆ కండిషన్‌ను తీసేసింది. ఎంతమంది పిల్లలను కన్నా మాతృత్వ సెలవులను పొందవచ్చని ఆ జీవోలో పేర్కొంది. ఈ నిబంధనలు తక్షణమే అమలులోకి వస్తాయని తెలిపింది. కాగా, కొత్తగా ఉద్యోగంలో చేరిన ప్రభుత్వ ఉద్యోగినులకు కూడా ప్రసూతి సెలవులు ఇవ్వాలని ఇటీవల ఏపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసింది. ప్రొబేషన్‌కు మాతృత్వ సెలవులకు ఎలాంటి ఇబ్బంది ఉండదని అప్పుడు గెజిట్ రిలీజ్ చేసింది. తాజాగా ఇద్దరు పిల్లలకే ప్రసూతి సెలవులు అన్న నిబంధనను కూడా తొలగించింది.సంతానోత్పత్తిని పెంచాలని ఏపీ సీఎం చంద్రబాబు చాలా రోజులుగా పిలుపునిస్తున్నారు. ఈ క్రమంలోనే రాష్ట్రంలో సంతానోత్పత్తి రేటును 1.5 శాతం నుంచి 2.1 శాతానికి పెంచేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని, ప్రోత్సహకాలు అమలు చేస్తామని ఇటీవల ఆయన ప్రకటించారు. ఈ క్రమంలోనే ఎన్నికాన్పులైనా ఉద్యోగులకు ప్రసూతి సెలవులు మంజూరు చేస్తామని ప్రకటించారు. అలాగే ఒక కుటుంబంలో ఇద్దరి కంటే ఎక్కువ మంది పిల్లలు చదువుకుంటున్నా అందరికీ తల్లికి వందనం పథకం వర్తింపజేస్తామని తెలిపారు.

# యాదగిరిగుట్టలోని చండీశ్వర భవనం కురుమ కులస్తులదే : కర్రె వెంకటయ్య



యాదగిరిగుట్ట, మే 05 : యాదగిరిగుట్టలోని చండీశ్వర భవనం ముమ్మాటికి కురుమ కులస్తుల భవనమేనని, ఎప్పటికైనా ఆ భవనాన్ని కైవసం చేసుకుంటామని కురుమ సంఘం రాష్ట్ర నాయకుడు కర్రె వెంకటయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు పేరవు రాములు కురుమ, మాజీ జడ్పీటీసీ తోటకూరి అనురాధ అన్నారు. సోమవారం యాదగిగుట్ట పట్టణంలో మీడియాతో వారు మాట్లాడారు. గత 20 ఏళ్లుగా కురుమ కులానికి పట్టిన శనిగా మాజీ ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశ్ మారాడని, ఆయన గద్దె దిగేవరకు ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని తెలిపారు. తన అనుచరులతో ఇష్టారాజ్యంగా ఓట్లేసుకుని 30 ఏళ్లుగా కురుమ సంఘం అధ్యక్షుడిగా ధనార్జనే ధ్యేయంగా పనిచేస్తూ, కురుమ కులస్తులకు తీరని అన్యాయం చేస్తున్నట్లు దుయ్యబట్టారు. యెగ్గె మల్లేశ్ కురుమ ట్రస్ట్ బోర్డు చైర్మన్‌గా ఉంటూ డబ్బులు దండుకునే పనిలో ఉన్నట్లు తెలిపారు. మన్సురాబాద్ కురుమ సంఘానికి చెందిన హాస్టల్ భవనాన్ని లీజుకు ఇచ్చిన డబ్బుల వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. హాస్టల్‌లో విద్యార్థుల వద్ద నెలవారి ఫీజులు వసూళ్లు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నట్లు చెప్పారు.

కొమురవెల్లిలో కురుమ కులస్తులను వాడుకున్నారే తప్పా, కులస్తులకు ఆయన చేసిందేమీ లేదన్నారు. యాదగిరిగుట్టలో కురుమ సంఘానికి చెందిన చండీశ్వర భవనంలోకి కురుమ కులస్తులకు అనుమతిలేదని చెప్పడం తీవ్ర అభ్యంతకరమన్నారు. ఎంతోమంది దాతల సహకారంతో నిర్మించిన భవనాన్ని తమ సొంత నిధులతో నిర్మించినట్లు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. భవన ప్రారంభోత్సవ సమయంలో కురుమ కులస్తులమంతా సంఘం నుంచి డబ్బులు ఖర్చు పెట్టుకుని వచ్చినట్లు తెలిపారు. శిలాఫలకంపై కురుమ కులస్తుల ప్రజా ప్రతినిధుల పేర్లు కూడా ఉన్నట్లు వెల్లడించారు. తమ సొంత నిధులతో భవనం నిర్మించామని, కురుమ కులస్తులు ఎవ్వరూ రావొద్దంటూ కబ్జాకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ ఘటనపై కురుమ కులస్తులు ఆగ్రహంతో ఉన్నారన్నారు.

యెగ్గె మల్లేశ్ చేసిన నిర్వాకంతో యాదగిరిగుట్టలో కురుమ కులస్తులకు స్వంత సత్రం లేకుండా పోయిందన్నారు. ఇప్పటికిప్పుడు భవనం నిర్మించాలంటే సాధ్యమయ్యే పరిస్థితి లేదన్నారు. ఇటీవల ఆలేరు పట్టణంలో దొడ్డి కొమురయ్య విగ్రహావిష్కరణకు వెళ్లిన కురుమ కులస్తులను ఆయన తీవ్రంగా అవమానపరిచారన్నారు. "చనిపోయినోళ్లకు విగ్రహాలు పెట్టడమేందిరా" "మీకేం పనిలేదురా మీ అమ్మా" అంటూ దుర్భాషలాడినట్లు ఆరోపించారు. ఈ నెల 15న యాదగిరిగుట్ట పట్టణంలో కురుమ సంఘం సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నట్లు, పార్టీలకు అతీతంగా కురుమ కులస్తులు పాల్గొనాలని కోరారు.

# ఎరువులు అధికంగా వాడితే పంటలకు అనర్థమే : జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ స్వామి



ఆదిలాబాద్, మే 5: రసాయన ఎరువులు అధికంగా వాడితే అనర్థమేనని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీధర్ స్వామి అన్నారు. సోమవారం మండలంలోని పొన్నారి గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణా విశ్వవిద్యాలయం పరిధిలోని కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రసాయన ఎరువులు అధికంగా వాడితే దిగుబడి తగ్గి పెట్టుబడులు పెరుగుతాయని పేర్కొన్నారు. సాధారణంగా నేల స్వభావం, భూసార్వాన్ని బట్టి ఎరువులు వాడాలని, కానీ రైతులు ఒకే రకమైన ఎరువులు వినియోగిస్తున్నారని తెలిపారు.

కేవీకే ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ వై ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ పంటలలో యూరియా వాడకం, రసాయనిక ఎరువులను తగ్గించాలని రైతులకు సూచించారు.

విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు రసీదును భద్రపర్చుకోవాలని, సాగు నీటిని ఆదా చేయాలని కోరారు. పంట మార్పిడి ని పాటించాలని, చెట్లను పెంచి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు కె రాజశేఖర్, జి మోహన్ దాస్, పోషాద్రి, సునీల్ కుమార్, జి శివచరణ్, వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్తలు రాజెందర్ రెడ్డి, ప్రవీన్, తాంసి డివిజన్ ఏడీఏ రవీందర్, మాజీ సర్పంచ్ అండె అశోక్, నాయకులు లింగారెడ్డి, మల్లయ్య ,ఆనంద్, రఘు, అనిల్ కుమార్, సాయినాథ్, రమణ, లక్ష్మీపతి, రైతులు పాల్గొన్నారు.

# సహజసిద్ధమైన మామిడిపండ్లను విక్రయించాలి:జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

**– కొనుగోలుదారులకు కార్బోరహిత మామిడి పండ్లను అందించాలి**

**– ఖమ్మం పెవిలియన్ గ్రౌండ్ లోని మామిడి పండ్ల స్టాల్ ను సందర్శించిన జిల్లా కలెక్టర్**




ఖమ్మం, మే 5 (నేటినిజం ప్రతినిధి): రైతులు, వినియోగదారులు మామిడి పండ్ల మార్కెట్ ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. సోమవారం నగరం లోని పెవిలియన్ గ్రౌండ్ లో కార్బైడ్ రహిత మామిడి పండ్ల మేళా స్టాల్ ను జిల్లా సందర్శించారు. స్టాల్ లో ఉంచిన పలు రకాల మామిడి పండ్లను పరిశీలించారు. స్టాల్ నిర్వాకులు బాణోత్ లక్ష్మణ్ నాయక్ తో కలెక్టర్ ముచ్చటించారు. గత 13 సంవత్సరాలుగా మామిడి పండ్లను నేరుగా అమ్ముతున్నానని, ముందుగా ఒకడిగా మొదలు పెట్టి నేను 10 మందికి పని కల్పించి వ్యాపారం చేస్తున్నానని తెలిపారు. ప్రజల నమ్మకం తో కార్బైడ్ రహిత పండ్లలను విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఇక్కడ పలు రకాల మామి పండ్లలను అమ్మడం జరుగుతుందని అన్నారు.

కలెక్టర్ చొరవతో ప్రత్యేకంగా రోటరీనగర్ లో మామిడి పండ్ల మార్కెట్ రావడం తో అక్కడ కూడా ఒక స్టాల్ ఏర్పాటు చేశామని రైతు లక్ష్మణ్ నాయక్ వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ...ఖమ్మం నగరం రోటరీ నగర్ లోని వీధి వ్యాపారుల ప్రాంగణంలో 30 పైగా స్టాళ్లతో మామిడి పండ్ల మార్కెట్ ను నూతనంగా ఏర్పాటు చేశామని, స్టాల్ లలో రైతులు పండ్ల అమ్మకం చేపట్టారని, రైతులు ఎక్కువ సంఖ్యలో విచ్చేసి మొత్తం స్టాల్ లు నిండుగా పండ్ల వ్యాపారం జరిగేలా చూస్తున్నమని తెలిపారు.

ఖమ్మం పరిసర మండలాలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి మామిడి రైతులు ఇక్కడికి విచ్చేసి పండ్లు విక్రయించుకుంటారని కలెక్టర్ తెలిపారు. రైతులకు, వినియోగదారులకు ఉపయోగపడే విధంగా మార్కెట్ అందుబాటులోకి వచ్చిందని, దళారులు లేకపోవడంతో రైతులకు గిట్టుబాటు ధర లభిస్తుందని, వినియోగదారులకు సహజ సిద్ధంగా పండించిన కార్బైడ్ రహిత మామిడి పండ్లు అందేలా చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ తెలిపారు. మామిడి పండ్ల మార్కెట్ మాత్రమే కాకుండా మామిడి సీజన్ ముగిసిన తర్వాత వివిధ సీజన్లలో వచ్చే ప్రత్యేకమైన పండ్లు జామ, సీతాఫలం, బొప్పాయి వంటివి రైతులు నేరుగా వచ్చి ఇక్కడ విక్రయించేలా చూడాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమం లో జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి ఎం.వి.మధుసూదన్, హార్టికల్చర్ అధికారిణి అనితశ్రీ, అధికారులు, తదితరులున్నారు.

# అంతర్జాతీయ స్థాయి కరాటే పోటీలకు టీమ్ కోచ్ గా మాడుగుల ప్రవీణ్



కరీంనగర్, ఏప్రిల్ మే 5: (నేటినిజం ప్రతినిధి) ఈనెల 9వ తేది నుంచి 12వ తేదీ వరకు మలేషియా లోని ఐపో నగరంలో జరగనున్న అంతర్జాతీయ స్థాయి కరాటే ఛాంపియన్ షిప్ పోటీలకు భీమదేవరపల్లి మండలం ముస్తఫాపూర్ గ్రామానికి చెందిన మాడుగుల ప్రవీణ్ టీమ్ కోచ్ గా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ప్రవీణ్ ని మంత్రి పొన్నం ప్రభాకర్, గ్రామ మండల నాయకులు అభినందించారు.

# అక్రమంగా నివసిస్తున్న పాకిస్తాన్ దేశస్థులను బహిష్కరించాలని తహసిల్దార్‌కు వినతిపత్రం అందజేత



రాజన్న సిరిసిల్ల, మే 5: (నేటినిజం ప్రతినిధి): పహల్గంలోని టెర్రరిస్టులు అమాయక హిందువులను కాల్చి చంపడంలో పాకిస్తాన్ హస్తం ఉందని, భారత దేశంలో ఉన్న పాకిస్థానీయులందరినీ వెంటనే బహిష్కరించాలని కోరుతూ రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు సోమవారం భారతీయ జనతా పార్టీ వేములవాడ పట్టణ బిజెపి అధ్యక్షులు రాపెల్లి శ్రీధర్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ దేశ ప్రధాని మోదీ ఆదేశించిన విధంగా బిజెపి పాలిత రాష్ట్రాలలో ఇప్పటికే దేశద్రోహులను గుర్తించి వారిని దేశం విడిచిపోయేలా చర్యలు తీసుకున్నారన్నారు. మన తెలంగాణా రాష్ట్రంలో కూడా వివిధ పట్టణాల లో గ్రామాలలో నివసిస్తున్న దేశద్రోహులను గుర్తించి వెంటనే వారిని మన దేశం నుంచి తరిమివేసేలా చర్యలు తీసుకోవాలి కోరారు. ఈ కార్యక్రమంలో అన్నం నరసయ్య, గుడిసె మనోజ్, వివేక్ రెడ్డి, కట్కం శ్రీనివాస్, నేరెళ్ల సాయి, తడక రాజు, బుర్ర మనీష్, నామాల శేఖర్, రేగుల శ్రీకాంత్, మామిళ్ల లక్ష్మిరాజు, సగ్గు రాహుల్, బిజెపి సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# పాకిస్థాన్ జాతీయులను వెంటనే భారత్ నుంచి బహిష్కరించాలి

**–భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు బుర్ర శేఖర్ గౌడ్**



రాజన్న సిరిసిల్ల, మే 5: (నేటినిజం ప్రతినిధి): అక్రమంగా భారతదేశంలో నివసిస్తున్న పాకిస్థాన్ జాతీయులను వెంటనే భారత్ నుంచి బహిష్కరించాలని కోరుతూ వేములవాడ అర్బన్ డిప్యూటీ తహశీల్దార్ కు

వేములవాడ అర్బన్ మండల భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు బుర్ర శేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు లింగపల్లి శంకర్,జిల్లా కౌన్సిల్ మెంబర్ చింతపల్లి వెంకటేశ్వరరావు,ఏరెడ్డి రాజిరెడ్డి,గుండెకర్ల లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి నర్సింగోజు శంకర్, ఉపాధ్యక్షుడు తిప్పారవేని రాజు,కార్యదర్శి కొలనూరి సంజీవ్ రెడ్డి,అధికార ప్రతినిధి కర్రె పవన్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు గొనె భాస్కర్,నాయకులు చల్ల నర్సయ్య,నాగుల పూర్ణ చందు గౌడ్, ముదం శ్రీనివాస్, ఎర్రం లక్ష్మి నర్సు,చెర్ల దేవరాజు, దామోదర్ రెడ్డి,ముడికే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# విజయవాడ - విశాఖపట్నం మధ్య ఉదయం విమాన సేవలు జూన్ 1 నుండి పునఃప్రారంభం. - కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు

న్యూఢిల్లీ, మే 5:విజయవాడ మరియు విశాఖపట్నం మధ్య ఉదయపు విమాన సర్వీసులను జూన్ 1వ తేదీ నుండి తిరిగి ప్రారంభించనున్నట్లు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి శ్రీ కింజరాపు రామ్మోహన్ నాయుడు వెల్లడించారు. రాష్ట్ర ఆర్థిక కేంద్రం విశాఖపట్నం నగరం నుండి రాజధాని విజయవాడ ప్రాంతం మధ్య విమాన సర్వీస్ తిరిగి ప్రారంభించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

ప్రస్తుత షెడ్యూల్ ప్రయాణికులకు మరింత సౌలభ్యం కలిగించేలా రూపొందించబడిందని మంత్రి తెలిపారు. ఇండిగో ఎయిర్‌లైన్స్ యఖీ విమానం విజయవాడ నుండి ఉదయం 7:15 గంటలకు బయలుదేరి, ఉదయం 8:25 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది, తిరుగు ప్రయాణంలో విశాఖపట్నం నుండి ఉదయం 8:45 గంటలకు బయలుదేరి, ఉదయం 9:50 గంటలకు విజయవాడకు చేరుకుంటుంది అని తెలిపారు.

ప్రాంతీయ విమాన కనెక్టివిటీని బలోపేతం చేయడం, అభివృద్ధి చెందుతున్న నగరాల మధ్య వేగవంతమైన రవాణా సౌకర్యాన్ని కల్పించడం తమ మంత్రిత్వ శాఖ యొక్క ప్రధాన లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రాభివృద్ధి, ప్రయాణికుల అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఈ కీలక సర్వీసును తిరిగి అందుబాటులోకి తీసుకురావడం ఎంతో సంతోషకరమైన విషయమని తెలిపారు.

# అంతర్జాతీయ స్థాయి కరాటే పోటీలకు సీఎస్కేఐ క్రీడాకారుల ఎంపిక



కరీంనగర్, ఏప్రిల్ మే 5: (నేటినిజం ప్రతినిధి) ఈనెల తొమ్మిదో తారీఖు నుంచి 12వ తేదీ వరకు మలేషియాలోని ఐపో నగరంలో జరగనున్న అంతర్జాతీయ స్థాయి కరాటే ఛాంపియన్షిప్ పోటీలకు కరీంనగర్ సి.ఎస్.కె.ఐ అకాడమి నుంచి ముగ్గురు క్రీడాకారులు ఎంపికయ్యారు. బాలికలు 19 సంవత్సరాల కటా విభాగంలో ఎం హాసిని -61 కేజీ, బాలురు 16 సంవత్సరాల కట విభాగంలో అబ్దుల్ రహీం -55 కేజీ. 14 సంవత్సరాల కటా విభాగంలో సయ్యద్ మహమ్మద్ -53 కేజీ, లో వీరందరూ ఎంపికైన ట్లు సి ఎస్ కె ఐ ఫౌండర్ అండ్ ఇండియా చీఫ్ షీహాన్ ఈ శ్రీనివాస్ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను సి ఎస్ కే ఐ చైర్మన్ చల్ల హరిశంకర్, ప్రధాన కార్యదర్శి మాడుగుల ప్రవీణ్, కోశాధికారి వంగల శ్రీధర్, మెంబర్ ఆర్ ప్రసన్న కృష్ణలు అభినందించారు. అలాగే మన దేశానికి పతకాలు సాధించాలని క్రీడాకారులకు సూచించారు.

# నిబంధనల ప్రకారం కట్టుదిట్టంగా ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాల అమలు.. జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**–మే 19 వరకు ఎలిగేడు మండలంలో రెవెన్యూ సంస్థల నిర్వహణ**

**–నిర్ణీత సమయంలో యువ వికాసం అర్హుల ఎంపిక**

**–చివరి గింజ వరకు నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం**

**–మే 10 వరకు ఇందిరమ్మ ఇండ్ల తుది లబ్ధిదారుల జాబితా ఎంపిక**

**–ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలపై పత్రిక సమావేశం నిర్వహించిన కలెక్టర్**

కరీంనగర్, ఏప్రిల్ మే 5: ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రాధాన్యత కార్యక్రమాలను కట్టుదిట్టంగా అమలు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ లో తన చాంబర్ లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలపై సోమవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నూతన ఆర్వోఆర్ చట్టం పై సుల్తానాబాద్ మండలం మినహా అన్ని మండలాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని, ధరణి చట్టం, భూ భారతి చట్టం మధ్య వ్యత్యాసాలను స్పష్టంగా రైతులకు వివరించామని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పెద్దపెల్లి జిల్లాలో మే ఐదు నుంచి మే 19 వరకు వెలిగేడు మండలంలోని ప్రతి గ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి భూ భారతి చట్టం క్రింద భూ సమస్యలపై దరఖాస్తులు స్వీకరిస్తున్నామని, రెవెన్యూ సదస్సుల లో వచ్చే దరఖాస్తులను పూర్తిస్థాయిలో జూన్ 2 వరకు పరిష్కరించేందుకు కృషి చేస్తామని కలెక్టర్ పేర్కొన్నారు.

కోర్టు కేసుల సమస్యలు, కుటుంబ వివాదాల సమస్యలు మినహాయించి మిగిలిన అన్ని రకాల సమస్యలను భూ భారతి చట్టం వినియోగించి పరిష్కరిస్తామని అన్నారు. ప్రతీరోజు రెవెన్యూ సదస్సులో ఎన్ని దరఖాస్తులు వస్తున్నాయో సమగ్ర రికార్డు నిర్వహిస్తున్నామని, ఆర్ఎస్ఆర్, అసైన్మెంట్ సమస్యలు, సాధా బైనామా దరఖాస్తులు, పార్–బీ సమస్యలు, ఇతర వివిధ రకాల భూ సమస్యలను భూ భారతి చట్టం ద్వారా పరిష్కరిస్తామని కలెక్టర్ తెలిపారు. రాజీవ్ యువ వికాసం పథకం కింద మన జిల్లాలో ఆన్ లైన్, ఆఫ్ లైన్ మొత్తం కలిపి సుమారు 47 వేల దరఖాస్తులు వచ్చాయని తెలిపారు.

ప్రభుత్వం కొంత మేర సబ్సిడీ, బ్యాంకు బ్యాంకు లింకేజీ కలిపి యువ వికాసం యూనిట్ గ్రౌండ్ చేయాల్సి ఉంటుందని, ఎన్‌పీఏ ఉన్న దరఖాసు దారులు, సిబిల్ స్కోర్ తక్కువగా ఉన్న దరఖాస్తుదారులను, గత ఐదు సంవత్సరాలలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ కార్పొరేషన్ల నుంచి యూనిట్లు పొందిన దరఖాస్తులను ముందుగా మినహాయిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. పట్టణ ప్రాంతాలలో అధికంగా దరఖాస్తులు వచ్చాయని, ప్రభుత్వం నిర్దేశించిన సమయంలో గా దరఖాస్తుల ధ్రువీకరణ పూర్తి చేస్తామని, రాష్ట్రం నుంచి జిల్లాకు యువ వికాసం నిధుల కేటాయింపు జరగగానే మండలాల వారీగా కేటాయింపులు చేసి అర్హుల తుది జాబితా ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం తయారు చేస్తామని అన్నారు.

గత వాన కాలం ఎటువంటి సమస్యలు లేకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియ విజయవంతంగా పూర్తి చేశామని, అదేవిధంగా యాసంగి పంట కొనుగోలుకు పటిష్ట చర్యలు చేపట్టామని అన్నారు. యాసంగి పంట సీజన్ లో పెద్దపెల్లి జిల్లాలో 3.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా 334 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ఇప్పటి వరకు 13 వేల 573 రైతుల నుంచి 240 కోట్ల విలువ చేసే లక్షా 6 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, రైతులకు 154 కోట్ల ధాన్యం డబ్బులు చెల్లించామని కలెక్టర్ తెలిపారు. సన్న రకం ధాన్యం కొనుగోలు లో ఉన్న సమస్యలను పరిష్కరించామని, ఇప్పటివరకు ఐదువేల మెట్రిక్ టన్నుల సన్న రకం ధాన్యం కొనుగోలు చేశామని అన్నారు.

జిల్లాలో ఎటువంటి డిఫాల్ట్ లేని 105 రైస్ మిల్లులకు ముందుగా ధాన్యం కేటాయింపులు చేశామని , రైస్ మిల్లర్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఎటువంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు ప్రక్రియ జరిగేలా చూస్తున్నామని అన్నారు. గత వాన కాలంలో ఒకేరోజు 15 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తే ప్రస్తుతం రెగ్యులర్ గా 15 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు జరుగుతుందని, యాసంగి పంటలో ఉత్పత్తి బాగా వచ్చినందున కొనుగోలు కేంద్రాలకు అధికంగా ధాన్యం వస్తుందని, నాణ్యత ప్రమాణాలు ఉన్న చివరి గింజ వరకు ధాన్యం ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రైతులు ఎటువంటి ఆందోళనకు గురి కావాల్సిన అవసరం లేదని అన్నారు.

కొనుగోలు కేంద్రాల వద్ద వాహనాల కొరత లేకుండా చర్యలు తీసుకున్నామని, అవసరమైన



హమాలీలను అదనంగా బీహార్ నుంచి రప్పించామని అన్నారు. అకాల వర్షాలు కురిస్తే అవకాశం ఉన్నందున ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేస్తున్నామని తెలిపారు.

పెద్దపెల్లి జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన గ్రామాలలో 1940 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయగా, 700 ఇండ్లు గ్రౌండ్ చేసామని, బేస్మెంట్ వరకు పూర్తి చేసుకున్న 150 ఇండ్లకు ప్రభుత్వం నిధులు విడుదల చేసిందని, ప్రతి సోమవారం ఇండ్ల నిర్మాణ పనుల పురోగతి ప్రకారం నిధులు విడుదల అవుతున్నాయని కలెక్టర్ తెలిపారు. మే 10 వరకు జిల్లాలో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 3500 చొప్పున ( పైలెట్ ప్రాజెక్టులో మంజూరు చేసిన మినహాయించి) లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేసేందుకు పటిష్ట కార్యాచరణ అమలు చేస్తున్నామని అన్నారు.

ఇందిరమ్మ కమిటీలు ఎంపిక చేసి అందించిన లబ్ధిదారుల జాబితాను అధికారులు మరోసారి వెరిఫై చేస్తున్నారని కలెక్టర్ తెలిపారు. ఇందిరమ్మ కమిటీ అందించిన జాబితాలో ఎక్కడైనా అనర్హులు ఉంటే వారిని తొలగించి వారి స్థానంలో అర్హులను ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. ఇందిరమ్మ కమిటీ ఆమోదించిన దరఖాస్తుల ధ్రువీకరణ తర్వాత జిల్లా ఇంచార్జి మంత్రి ఆమోదంతో మంజూరు పత్రాలు పంపిణీ చేసి గ్రౌండ్ చేస్తామన్నారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలు ఎక్కడైనా అనర్హులకు కేటాయించినట్లు తెలిస్తే వెంటనే వాటిని రద్దు చేసే అధికారం జిల్లా యంత్రాంగానికి ప్రభుత్వం కేటాయించిందని, ఎక్కడైనా ఎవరైనా అనర్హులకు ఇండ్లు మంజూరు అయితే అధికారులకు ఫిర్యాదు చేయాలని కలెక్టర్ తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పనులు పర్యవేక్షించేందుకు ప్రతి మండలానికి ప్రభుత్వం అసిస్టెంట్ ఇంజనీరు కేటాయిస్తుందని తెలిపారు.

# ఐదుగురు సెల్‌ఫోన్ దొంగల అరెస్ట్.. 17 సెల్‌ఫోన్లు స్వాధీనం

మహబూబ్‌నగర్, మే 5:సెల్‌ఫోన్లు దొంగతనాలు చేస్తున్న ఐదుగురిని బిజినపల్లి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్సై శ్రీనివాస్ తెలిపిన ప్రకారం.. కొంతకాలంగా పలు ప్రాంతాలలో సెల్‌ఫోన్‌ల చోరీకి పాల్పడుతున్న వనపర్తి జిల్లా కొత్తకోటకు చెందిన సాయి కృష్ణ, రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్‌కు చెందిన కిరణ్, ఒడిస్సా రాష్ట్రంలోని జైపూర్ జిల్లా కంత్ర గ్రామానికి చెందిన కిరణ్ దాస్, గంజం జిల్లాలోని సర్దా గ్రామానికి చెందిన దాసు వంశీ , గంజం జిల్లాలోని అస్కనూరు పల్లి గ్రామానికి చెందిన రోహన్‌ను అరెస్టు చేశామని తెలిపారు. సోమవారం బిజినపల్లి మండల కేంద్రంలోని బస్టాండ్‌లో సెల్‌ఫోన్‌ను దొంగలిస్తుండగా పట్టుకున్నామని వివరించారు.

# భూ సమస్యల పరిష్కారానికి రైతులు దరఖాస్తు చేసుకోవాలి : అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

బోనకల్లు, మే 05 : భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని అమల్లోకి తెచ్చిందని, గ్రామాల్లో చేపడుతున్న రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యల పరిష్కారానికి దరఖాస్తు చేసుకోవాలని ఖమ్మం అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. జిల్లాలోని బోనకల్లు మండలం గార్లపాడు రెవెన్యూ గ్రామాన్ని భూ సమస్యల పరిష్కారానికి పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. సోమవారం అదనపు కలెక్టర్ రెవెన్యూ సదస్సులో పాల్గొని దరఖాస్తులు స్వీకరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు తమ భూముల విషయంలో ఉన్న అభద్రత భావాన్ని పోగొట్టేందుకు, జవాబుదారితనాన్ని పెంచేందుకు ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తెచ్చినట్లు తెలిపారు. కొత్త చట్టం ద్వారా లావాదేవీల సేవలు, రిజిస్ట్రేషన్, మ్యుటేషన్, నిషేధిత భూములు, ఆర్ఓఆర్ మార్పులు చేర్పులు వంటి సేవలు సులభతరం కానున్నట్లు వెల్లడించారు. హక్కుల రికార్డుల్లో తప్పుల సవరణకు భూ భారతి లో అవకాశం ఉందన్నారు. పెండింగ్ సాదా బైనామా దరఖాస్తుల పరిష్కారం లభిస్తుందన్నారు. భూమి హక్కులు ఏ విధంగా సంక్రమించిన మ్యుటేషన్ చేసి రికార్డులలో నమోదు చేయవచ్చన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి భూ భారతి చట్టంలో రెండు అంచెల అప్పీల్ వ్యవస్థ ఉందని తెలిపారు. భూదార్ కార్డుల జారీ జరుగుతుందన్నారు. రైతులకు ఉచిత న్యాయ సహాయం లభిస్తుందని తెలిపారు. గ్రామ రెవెన్యూ రికార్డుల నిర్వహణ ఉంటుందని, మోసపూరితంగా హక్కుల రికార్డులు మార్చి, ఎవరైనా ప్రభుత్వ, భూదాన్, అసైన్డ్, ఎండోమెంట్, వక్ఫ్ భూములకు పట్టాలు పొందితే రద్దుచేసే అధికారం చట్టంలో ఉందన్నారు. హక్కుల రికార్డుల్లో తప్పుల సవరణకు, భూమి హక్కులు ఉండి రికార్డులో లేనివారు హక్కుల రికార్డులో నమోదు చేయించుకోవడానికి కొత్త చట్టం వచ్చిన సంవత్సరంలోగా దరఖాస్తు చేసుకోవాలని అదనపు కలెక్టర్ అన్నారు. గార్లపాడులో చేపట్టిన రెవెన్యూ సదస్సులో రైతుల నుండి భూ సమస్యలకు సంబంధించి 67 దరఖాస్తులు స్వీకరించి, రశీదులు ఇచ్చారు.

# ఎన్‌ఈఈటీ పరీక్షకు ముఖ గుర్తింపు ప్రయోగాత్మక కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన యూఐడీఏఐ

న్యూఢిల్లీ, మే 5:'జాతీయ అర్హత–ప్రవేశ పరీక్ష (నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రెన్స్ టెస్ట్.. ఎన్‌ఈఈటీ యూజీ) 2025'ను నిర్వహించే కాలంలో అభ్యర్థుల ముఖ గుర్తింపు పద్ధతిని ఉపయోగించే అంశంపై నిర్ధారణ కసరత్తును భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (యూఐడీఏఐ) విజయవంతంగా పూర్తి చేసింది.

ఈ కార్యక్రమాన్ని నేషనల్ ఇన్ఫర్మాటిక్స్ సెంటర్ (ఎన్ఐసీ), నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ)ల సహకారంతో చేపట్టారు. ఇది ఆధునిక బయోమెట్రిక్ టెక్నాలజీని ఉపయోగించి పరీక్ష నిర్వహణ పరంగా తీసుకోవాల్సిన భద్రతను మరింత కట్టుదిట్టం చేయడంతోపాటు, అభ్యర్థి ధ్రువీకరణనూ విజయవంతంగా పరీక్షించారు.

మన దేశంలో అన్నింటి కన్నా పెద్ద ప్రవేశ పరీక్షల్లో ఒకటైన నీట్ పరీక్ష రాసే అభ్యర్థుల గుర్తింపును సరిచూసే సాధనంగా ఆధార్–ఆధారిత ముఖ ప్రమాణీకరణ ఎంతవరకు సాధ్యం, ఎంత ప్రభావశీలంగా ఉంటుందన్న అంశాల్ని మదింపు చేయడమే ఈ కసరత్తు ఉద్దేశం.

ఈ నిర్ధారణ కసరత్తు క్రమంలో.. ఢిల్లీలో ఎంపిక చేసిన 'నీట్' కేంద్రాల్లో ఆధార్ ఆధారిత ముఖ గుర్తింపును ఉపయోగించారు. దీనిని ఎన్ఐసీకి చెందిన డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌తో పాటు ఎన్‌టీఏకు చెందిన పరీక్ష ప్రోటోకాల్స్‌తో కలిపి ఎలాంటి అవాంతరాలకు తావు లేకుండా పరీక్షించారు.

ఆధార్‌తో ముడిపెట్టిన బయోమెట్రిక్ సమాచారాన్ని ఉపయోగించుకొంటూ, ముఖ ప్రమాణీకరణను వాస్తవిక సమయంలో (రియల్–టైమ్) పూర్తి చేశారు. దీంతో ప్రక్రియ సంపర్క రహితంగానూ (కాంటాక్ట్ లెస్), మరింత సువ్యవస్థితంగానూ మారింది. అభ్యర్థుల గుర్తింపును సరిచూడటంలో వచ్చిన ఫలితాలు ఉన్నత స్థాయి కచ్చితత్వాన్నీ, ప్రభావశీలత్వాన్నీ కలిగి ఉన్నాయి.

పెద్ద ఎత్తున నిర్వహించే పరీక్షల్లో గుర్తింపును సరిచూడడానికి ఒక సురక్షిత, విస్తృత, విద్యార్థి అనుకూల పరిష్కార మార్గంగా ఆధార్ ముఖ గుర్తింపునకు గల సమర్థతను కూడా ఈ కార్యక్రమం తెలియజెప్పింది. రాబోయే కాలంలో దీనిని ఉపయోగించడానికి ఉన్న అవకాశాలను సైతం ఇది చాటి చెప్పింది. ఇది...ప్రవేశ పరీక్షల వేళ మోసాలకు పాల్పడే వారిని దీటుగా అడ్డుకోవడంలో ఇది కీలక భూమికను పోషించగలదన్నది తెలిసింది.

ప్రభుత్వం నిర్వహించే కార్యక్రమాల్లో... పారదర్శకత్వాన్నీ, భద్రతను మెరుగుపరచడానికి డిజిటల్ నవకల్పనను ఉపయోగించాలన్న ప్రభుత్వ నిబద్ధతకు ఈ సహకారపూర్వక ప్రయత్నం అద్దం పడుతోంది.

# సీసీ రోడ్ల నిర్మాణంలో నాణ్యత పాటించాలి.. ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఆదేశం



హైదరాబాద్, మే 5: సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

మచ్చబొల్లారం డివిజన్ లక్ష్మమ్మ ఎన్‌క్లేవ్‌లో రూ. 50 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆయన సోమవారం శంకుస్థాపన చేశారు.

అనంతరం మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. గుంతలు పడిన రోడ్లతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని గుర్తించామని అన్నారు. సీసీ రోడ్ల నిర్మాణంలో నాణ్యతా లోపాలు లేకుండా పనులను అధికారులు పరిశీలిస్తారని చెప్పారు. సర్కిల్ పరిధిలోని అన్ని రోడ్లను అధికారులతో సర్వే చేయించి, అవసరమైన కాలనీల్లో వెంటనే సీసీ రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభిస్తామని చెప్పారు.

## దళారులకు ధాన్యం విక్రయించవద్దు : మల్లారెడ్డి

శామీర్‌పేట: రైతు సంక్షేమమే లక్ష్యంగా వ్యవసాయదారుల సేవా సహకార సంఘం కృషిచేస్తుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. శామీర్‌పేట మండలంలోని వ్యవసాయదారుల సేవా సహకార సంఘం కార్యాలయం, అలియాబాద్‌లోని డీసీఎంఎస్ వైస్ చైర్మన్ రామిడి మధుకర్ రెడ్డితో కలసి సోమవారం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు.

అనంతరం మల్లారెడ్డి మాట్లాడుతూ.. దళారులకు ధాన్యం విక్రయించి ఆర్థికంగా నష్టపోవద్దని సూచించారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.
Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: B. Devadas. **RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.